మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493
సహాయ
మీడియా సర్వీసు రి.
3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68



www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక
Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 19 ఆదివారం జులై 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 124
Navabhoomi daily fallows..
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram, Visakhapatanm,Kurnool,Chittoor,Kadapa,and Anantapur







## తెలంగాణ మావోయిస్టు కార్యదర్శి
# దామోదర్ మృతి

- కాంకేర్ ఎన్‌కౌంటర్‌లో మావో కీలక నేత బడే చొక్కారావు అలియాస్ దామోదర్ మృతి
- గతంలో తెలంగాణ కార్యదర్శి హరిభూషణ్ కరోనాతో కన్నుమూత
- హరిభూషణ్ స్థానంలో గత ఏడాది జనవరిలో దామోదర్ నియామకం
- దామోదర్ స్వస్థలం తాడ్వాయి మండలం కాల్వపల్లి
- మిల్ట్రీ చీఫ్‌గా మావోయిస్టు పార్టీలో పనిచేసినట్లు సమాచారం
- దామోదర్ మృతి చెందినట్లు దక్షిణ బస్తర్ కార్యదర్శి గంగ పేర ఒక లేఖ



**కొత్తగూడెం జనవరి 18 నవభూమి ప్రతినిధి:** మావోయిస్టు పార్టీ తెలంగాణ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ శుక్రవారం చత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్లో మృతి చెందారు. గతంలో తెలంగాణ కార్యదర్శి యాప నారాయణ అలియాస్ హరి భూషణ్ కరోనాతో చనిపోవడంతో బడే చొక్కారావు గత ఏడాది జనవరిలో తెలంగాణ కార్యదర్శిగా నియమించారు. చొక్కారావుది ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి స్వగ్రామం. ఇతను మిల్ట్రీ చీఫ్‌గా మావోయిస్టు పార్టీలో పనిచేసినట్టు సమాచారం. హరి భూషణ్ చత్తీస్‌గఢ్‌లో 2021 జూన్ జూన్ 21న కరోనాతో మృతి చెందారు. ఖాళీగా ఉన్న మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పదవిని దామోదర్‌కి అప్పగించారు. మావోయిస్టు పార్టీ నేత ఆజాద్ సైతం తెలంగాణ కార్యదర్శి పదవి కోసం గట్టి ప్రయత్నాలే చేశారు. ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్లో ఇంత పెద్ద స్థాయి అగ్రనేత మృతి చెందడం ఇదే ప్రథమం. కాగా దామోదర్ మృతి చెందినట్లు దక్షిణ బస్తర్ కార్యదర్శి గంగ పేర ఒక లేఖ విడుదల చేశారు

## మావోయిస్టు పార్టీకి ఎదురుదెబ్బ

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ - మారేడుబాక అడవుల్లో 2 రోజుల క్రితం జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఈ భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కీలక నేత కూడా మృతి చెందారు.

# ఏపీలో మెగా స్కెచ్

- ఏపీ రాజకీయాల్లోకి మెగా బ్రదర్
- చిరంజీవికి భారీ ఆఫర్ ఇచ్చిన బీజేపీ
- ఏపీ బీజేపీ పగ్గాలు చిరంజీవికి ఇచ్చే ఛాన్స్
- ముందు రాజ్యసభ..ఆ తర్వాత కేంద్రమంత్రి పదవి
- ఏపీలో బీజేపీని బలోపేతం చేసే బాధ్యత చిరుకు


2



**అమరావతి-నవభూమిబ్యూరో**
ఏపీ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.కూటమిగానే కొనసాగుతూ 3 పార్టీలు తమ సొంత బలం పెంచుకునేందుకు వ్యూహాలు అమలు చేస్తున్నాయి. ఏపీపైన బీజేపీ కేంద్ర నాయకత్వం మెగా ఆపరేషన్ మొదలు పెట్టింది. ఇప్పటికే పవన్ నుంచి మోదీ నాయకత్వానికి పూర్తి మద్దతు ఉంది. దీంతో, చిరంజీవి తమతో భవిష్యత్ రాజకీయంగా కలిసి వచ్చేందుకు భారీ స్కెచ్ అమలు చేస్తోంది. ఢిల్లీ కేంద్రంగా సాగిన తాజా మంత్రాంగంలో చిరంజీవికి భారీ ఆఫర్ వచ్చింది. పవన్ సైతం బీజేపీ ప్లాన్‌కు పై అంటున్నట్లు తెలుస్తోంది. ఇక నెక్స్ట్ జరిగేదేంటి. ఏపీ పై మోదీ స్కెచ్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బీజేపీ నాయకత్వానికి ఏపీ పైన రాజకీయంగా ఆశలు పెరిగాయి. ఎంతో కాలంగా ఏపీలో ఎదగాలని చేస్తున్న ప్రయత్నాలు కలిసి రాలేదు. ఇక, ఇప్పుడు రాష్ట్రంలో రాజకీయ సమీకరణాల వేళ తాము ఎదిగేందుకు ఇదే సరైన సమయంగా బీజేపీ భావిస్తోంది. ఇందు కోసం మెగా మద్దతు కోసం అనేక రకాల ఫీట్స్ చేస్తోంది. పవన్ ను పార్లమెంట్ సెంట్రల్ హాల్ లో ప్రశంసించిన మోదీ..ఈ మధ్య కాలంలో చిరంజీవికి ప్రాధాన్యత ఇస్తున్నారు. కూటమి ప్రభుత్వ ప్రమాణ స్వీకార వేళ.. మెగా బ్రదర్స్ ఇద్దరితో కలిసి ప్రధాని అభివాదం చేసిన సమయంలోనే బీజేపీ భవిష్యత్ ప్రణాళికల పైన స్పష్టమైన సంకేతాలుగా భావించారు. చిరంజీవికి

# ఉగాది నుంచి 'గద్దర్' అవార్డులు

- గద్దర్ పేరిట తెలుగు చలన చిత్ర అవార్డుల ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలి
- డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు ఆదేశం
- సచివాలయంలో గద్దర్ అవార్డుల కమిటీ సమావేశం
- అవార్డుల కోసం లోగో..విధి విధానాలు,నియమ నిబంధనలపై చర్చ



2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
ఈ ఏడాది ఉగాది పండుగ నుంచి గద్దర్ చలనచిత్ర అవార్డులను తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కమిటీ సభ్యులు, అధికారులు వేగంగా ఏర్పాటు పూర్తి చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో గద్దర్ అవార్డుల కమిటీ శనివారం సమావేశం జరిగింది. అవార్డుల కోసం లోగోతో సహా విధివిధానాలు, నియమ నిబంధనలపై కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు భాషలో నిర్మించిన ఉత్తమ చిత్రాలను గుర్తించి, ప్రశంసిస్తూ అవార్డులు అందించనున్నట్లు తెలిపారు.
జాతీయ సమైక్యత, ఐక్యతను పెంపొందించే సాంస్కృతిక, విద్యా, సామాజిక ఔచిత్యం కలిగిన అత్యున్నత సాంకేతిక నైపుణ్యం, మానవతా విలువలతో కూడిన చిత్రాల నిర్మాణాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో అవార్డులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డుల కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించిన ట్లు చెప్పారు. అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని జాతీయస్థాయి కార్యక్రమాల తరహాలో నిర్వహించాలని భట్టి సూచించారు. సినిమా నిర్మాణంలో హైదరాబాద్‌ను ప్రపంచ గమ్య స్థానంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేవంత్ రెడ్డి

# బీజేపీ అధ్యక్ష రేసులో ఈటల!

- తెలంగాణ బీజేపీ చీఫ్ పదవిపై కిషన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- బీజేపీ అధ్యక్ష రేసులో ఈటల ఉన్నట్లు పేర్కొన్న కిషన్‌రెడ్డి
- బీజేపీ చీఫ్ విషయంలో పూర్తి నిర్ణయాధికారం అధిష్టానానికే
- బీజేపీ అధ్యక్షుడికి ఆర్ఎస్ఎస్ బ్యాక్‌గ్రౌండ్ అక్కర్లేదు




**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధ్యక్ష పదవిపై, ఇటీవల చిరంజీవి తమ నివాసంలో సంక్రాంతి వేడుకలలో పాల్గొనటం పైన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి. నాంపల్లిలోని బిజెపి కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ నిర్వహించిన కిషన్ రెడ్డి ఈ సమయంలో బిజెపి అధ్యక్ష పదవిపైన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బిజెపి అధ్యక్షుడు కావాలంటే ఆర్ఎస్ఎస్ బ్యాక్ గ్రౌండ్ ఉండాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. బీజేపీ అధ్యక్ష రేసులో ఆయనే రెండుసార్లు బిజెపి క్రియాశీలక సభ్యత్వం ఉంటే సరిపోతుందని ఆయన వెల్లడించారు. అంతేకాదు రెండుసార్లు బిజెపి గుర్తుపై పోటీ చేసినా సరిపోతుందని కిషన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు బిజెపి నుండి మల్కాజ్గిరి కి పోటీ చేసి ఎంపీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఈటల రాజేందర్ కూడా బిజెపి అధ్యక్షుడు రేసులో ఉంటారని కిషన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. నిర్ణయాధికారం అధిష్టానానిదే ఇక కిషన్ రెడ్డి వ్యాఖ్యలతో రాబోయే రోజుల్లో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఈటల రాజేందర్ అవుతారా అన్నది ఇప్పుడు పార్టీలో ఆసక్తికరంగా మారింది. ఇక బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిని నిర్ణయించే విషయంలో పూర్తి నిర్ణయాధికారం అధిష్టానానికే ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి తెలిపారు. ఇక ఇదే సమయంలో ఢిల్లీలో కిషన్ రెడ్డి నివాసంలో నిర్వహించిన సంక్రాంతి వేడుకలలో చిరంజీవి పాల్గొనడం పైన కూడా ఆయన స్పందించారు. చిరంజీవితో సంబంధాలపై కిషన్ రెడ్డి మెగాస్టార్ చిరంజీవితో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని ఆ సంబంధాల నేపథ్యంలో తాను పిలిస్తే తన మాట కాదనకుండా చిరంజీవి వస్తారని ఆయన అన్నారు. ఇద్దరు ఒకరిని ఒకరం కుటుంబ సభ్యులుగా భావిస్తామని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఒక్క చిరంజీవి మాత్రమే కాదు చాలామంది సినీ ప్రముఖులతో బీజేపీకి సంబంధాలు ఉన్నాయని చాలామంది పార్టీలో చేరి మంత్రులు, కేంద్ర మంత్రులు కూడా అయ్యారని కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.

## ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాల్సిందే

- కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం
- తప్పనిసరిగా భారతరత్న వస్తుంది
- ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తూ వస్తున్నాం

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
ఎన్టీఆర్ మూడు అక్షరాలు మూడు దశాబ్దాల పాటు తెలుగు ఘనతను విశ్వవీధిన చాటాయని, తెలుగువాడికి కీర్తిని రెపరెపలాడించిన ఎన్టీఆర్‌కు భారత రత్న ఇవ్వాలని ఏపీ ఐటీ మంత్రి నారా లోకేశ్ డిమాండ్ చేశారు. పేదవాటికి పట్టెడు అన్నం పెట్టి,గూడు కట్టించి ఇచ్చిన మహానుభావుడిని చరిత్ర ఎప్పుడూ మరిచిపోదన్నారు. తెలుగు చలన చిత్ర రంగ గతిని మార్చిన మహానటుడు ఎన్టీఆర్ అని,ఆయనకు భారత రత్న ఎప్పుడో దక్కాల్సి ఉండేదన్నారు.


శ్రీ చిత్తారమ్మ దేవి జాతర
19.01.2025. ఆదివారం



హెచ్.యం.టి. సమీపంలో గల
గాజులరామారం గ్రామంలో
శ్రీ చిత్తారమ్మ దేవి వార్షిక జాతర
తేది.19.01.2025 ఆదివారం జరుగును.
ఉదయం 3 గం॥లకు అమ్మవారి పూజలు
ప్రారంభమగును.
ఉ॥ 11.00 గం॥లకు అమ్మవారి
బోనములు తీయుదురు.
మ॥3.00 గం॥లకు రథము ఊరేగింపు,
రాత్రి 9 గం॥ల నుండి వినోద
ప్రదర్శనలు ఉదయం వరకు జరుగును.
తేది : 25.1.2025 ఉ॥ 11 గం॥లకు
అన్నదాన కార్యక్రమం జరుగును.
కావున భక్తులందరూ అధిక సంఖ్యలో
పాల్గొన గలరని మనవి.


కూన అంతయ్య గౌడ్
చైర్మన్, ఆలయకమిటీ

50 స్వర్ణోత్సవాలు


రాచకొండ బాలరాజ్
ప్రధాన కార్యదర్శి


పి.శంకర్ రెడ్డి
సలహాదారులు


కె.శ్రీనివాస్‌గౌడ్
సలహాదారులు


డి.ఇంద్రసేనారెడ్డి
సలహాదారులు


ఎ.ఇంద్రసేన గుప్తా
సలహాదారులు


యం.పెంటారెడ్డి
కార్యవర్గ సభ్యులు


డి.క్రిష్ణారెడ్డి
కార్యవర్గ సభ్యులు


జి.నర్సింహ
కార్యవర్గ సభ్యులు


ఆర్.నర్సింహ
కార్యవర్గ సభ్యులు


ఆర్.సత్తయ్య
కార్యవర్గ సభ్యులు



# హైదరాబాద్ కాల్పుల కేసులో నిందితుడి గుర్తింపు

**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్‌లో కాల్పులకు తెగబడ్డ నిందితుడిని మనీశ్‌గా గుర్తించారు. ఇతడు బీహార్ రాష్ట్రానికి చెందిన వాడుగా పోలీసులు తెలిపారు. మనీష్‌తో బీహార్ రాష్ట్రానికి చెందిన మరో నిందితుడు జతకట్టాడు. వారం రోజుల క్రితం నిందితుల చోరీలు మొదలు పెట్టారు. ఛత్తీస్‌గడ్‌లో వారం రోజుల క్రితం ఏటీఎం సిబ్బందిని బెదిరించి 70 లక్షల రూపాయలు మనీష్ అండ్ కో కాజేశారు. అనంతరం గురువారం (జనవరి 16) బీదర్‌లో ఏటీఎం సెక్యూరిటీ గార్డ్‌ను హత్య చేసి రూ.93 లక్షలు మనీశ్ ఎత్తుకెళ్లాడు. బీదర్ నుంచి హైదరాబాద్ వచ్చిన మనీశ్.. అఫ్జల్‌గంజ్‌లో కాల్పులు జరిపాడు. ఇప్పటికే మనీశ్‌పై బీహార్ ప్రభుత్వం రివార్డు ప్రకటించింది. గతంలోనూ మనీష్‌పై మర్డర్, దోపిడి కేసులు ఉన్నాయి. గతంలో కేసులు నమోదైనప్పుడు మనీష్ బార్డర్ దాటి నేపాల్ పారిపోయాడు. కేసుల తీవ్రత తగ్గాక ఇండియాకు వచ్చి మళ్లీ దోపిడీలకు పాల్పడుతున్నాడు మనీశ్. మనీశ్‌ను పట్టుకునేందుకు నాలుగు రాష్ట్రాల పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. తెలంగాణ, బీహార్, కర్ణాటక, చత్తీస్‌గడ్‌లో మనీశ్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.కోఠీని ఆపుతోంది ఎవరు.. ఎందుకిలా చేస్తున్నాడుహైదరాబాద్ అఫ్జల్‌గంజ్ కాల్పుల ఘటనలో పోలీసులు పురోగతి సాధించారు. అఫ్జల్‌గంజ్ నుంచి ఆటోలో సికింద్రాబాద్ వెళ్లిన నిందితులు అక్కడ బట్టలు, బ్యాగులు కొనుగోలు చేశారు. తిరుమలగిరి వద్ద ఓ నిర్మానుశ్య ప్రదేశంలో బట్టలు, బ్యాగులు మార్చుకున్నారు. తిరుమలగిరిలో బ్యాగులను నిందితులు వదిలేశారు. ట్రాలీ బ్యాగ్‌ను అక్కడే వదిలేసి పారిపోయారు. సుచిత్ర వైపు నిందితులు పరారైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.



# ఇది నిజంగా అద్భుతమే.. పుట్టిన కాసేపటికే పునర్జన్మ.. దైవ పరీక్షా..? మానవ మహత్యమా..?



**హైదరాబాద్-నవభూమి:** తల్లిగర్భం నుంచి బయటకు వచ్చిన శిశువు.. ఊపిరి తీసుకోవటంలో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంది. ఏమైందో తెలియని పరిస్థితిలోనే పెద్దాస్పత్రికి తీసుకెళ్తున్న సమయం లోనే.. ఆ చిన్ని గుండె కొట్టుకోవటం ఆగిపోయింది. పుట్టిన కాసేపటికే ఆ చిన్నారి చలనం లేకుండా మారిపోయింది. కానీ అప్పుడే.. అంబులెన్స్‌లో ఉన్న టెక్నీషియన్ చేతులు అద్భుతాన్ని చేశాయి. అప్పుడే పుట్టిన ఆ చిన్నారికి ఆ అంబులెన్స్ టెక్నీషియన్ తన సమయస్ఫూర్తితో మళ్లీ ప్రాణం పోశాడు. ఇది నిజంగానే ఓ అద్భుతం.

కొన్ని సన్నివేశాలు చూస్తుంటే.. ఇది దేవుడు పెట్టే పరీక్షా..? విధి అడే వింత నాటకమా..? మానవుని మహత్యమా..? అనే అనుమానం కలుగుతుంటుంది. అచ్చంగా అలాంటి సందర్భమే ఎదురైంది ఇక్కడ కూడా. నవమాసాలు తల్లిగర్భంలో ఉన్న శిశువు అప్పుడే బయటకు వచ్చి.. నేను వచ్చేశానంటూ కేర్ కేర్ మంటూ ఏడుస్తూ అందరికీ వినిపించేలా చెప్పింది. ఆ శిశువు ఏడుపు వినగానే.. ప్రపంచాన్ని జయించినంత ఆనందంతో ఆ తల్లి ముఖం వెలిగిపోయింది. అప్పటివరకు పడిన పురిటినొప్పుల బాధనంతా.. ఆ బుజ్జాయి స్పర్శతో పూర్తిగా మర్చిపోయింది. మహాలక్ష్మి పుట్టిందన్న విషయం తెలియగానే.. ఆ కుటుంబ సభ్యులంతా సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఎప్పుడెప్పుడు ఆ చిన్నారిని చేతుల్లోకి తీసుకుని ముద్దాడదామా అని ఆతృత అందరి కళ్లలో కనిపిస్తోంది. కానీ.. వాళ్లందరినీ కాలం పరీక్షించాలనుకుందో ఏమో.. పెద్ద పరీక్షే పెట్టింది. అప్పుడే పోసుకున్న ప్రాణం ఊపిరందక విలవిల్లాడిపోయింది. చూస్తున్నంతలోనే.. ఆ చిన్ని గుండె కొట్టుకోవటం ఆగిపోయింది. ఈ ఊహించని పరిణామం చూసి.. అప్పటివరకు ఆనందంలో ఉన్న కుటుంబసభ్యులంతా ఒక్కసారిగా హతాశులయ్యారు. ప్రాణం పోసినట్టే పోసి.. అంతలోనే ఆయువు తీసేశావేంటయ్యా అంటూ దైవాన్ని దీనంగా నిందించటం మొదలుపెట్టారు. ఆ తల్లి కళ్లలో ఆనందాన్ని అర నిమిషమైనా ఉండనివ్వకుండా కన్నీళ్లు నింపేస్తావా అంటూ ప్రశ్నిస్తున్నారు. అందరి గుండెలు బాధతో బరువైన సమయంలో మరో అనుకోని అద్భుతం జరిగింది. చనిపోయిందనుకున్న ఆ చిన్నారి మళ్లీ ఊపిరి పీల్చుకుంది. ఆగిపోయిందనుకున్న ఆ చిన్ని గుండె మళ్లీ కొట్టుకుంది. ఈ అద్భుతం.. మెదక్ జిల్లాలో జరిగింది.మెదక్ ప్రభుత్వాసుపత్రిలో ఓ గర్భిణీ.. పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. పుట్టిన కాసేపటికే ఉన్నట్టుండి పాప ఊపిరి తీసుకోవటంలో తీవ్రంగా ఇబ్బంది పడింది. చేతుల్లో ఇమిడిపోయే ఆ పసిప్రాణానికి ఊపిరందక అల్లాడిపోయింది. పరీక్షించిన వైద్యులు శివువు పరిస్థితిని అంచనావేసి.. మెరుగైన చికిత్స కోసం వెంటనే.. హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు.

హుటాహుటిన.. అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు బయలుదేరగా.. మార్గమధ్యలోనే పాప గుండె కొట్టుకోవటం ఆగిపోయింది. అది కూడా తల్లిదండ్రులకు కూడా ఊపిరాగిపోయినంత పనైంది. పాపను గమనించిన 108 అంబులెన్స్ టెక్నీషియన్ రాజు.. సమయస్ఫూర్తితో వ్యవహరించాడు. ముక్కుపచ్చలారని ఆ శిశువుకు వెంటనే సీపీఆర్ చేశాడు. దీంతో.. ఆ చిన్ని గుండె మళ్లీ కొట్టుకోవటం ప్రారంభించింది. దీంతో.. ఆ చిన్ని ప్రాణానికి ఆ అంబులెన్స్ టెక్నీషియన్.. మరోసారి ప్రాణం పోశాడు.ఆ శిశువును నీలోఫర్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్యంగా ఉందని వైద్యులు తెలిపారు. సరైన సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించి పాపకు సీపీఆర్ చేసిన టెక్నీషియన్ రాజును వైద్యులు, అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

# సుచిర్ బాలాజీ మృతిపై ఓపెన్ ఏఐ నుంచి ఆసక్తికర రియాక్షన్!



**హైదరాబాద్-నవభూమి:** చాట్ జీపీటీ మాతృ సంస్థ "ఓపెన్ ఏఐ"లో నాలుగేళ్లు పరిశోధకుడిగా పనిచేసిన విజిల్ బ్లోయర్, భారత సంతతి వ్యక్తి సుచిర్ బాలాజీ అనుమానాస్పద మృతి తీవ్ర సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఈ మృతిపై పలు అనుమానాలు తెరపైకి వస్తున్నాయి. ఈ క్రమంలోనే సుచిర్ బాలాజీ తల్లి పూర్ణిమారావు ఓపెన్ ఏఐపై సంచలన ఆరోపణలు చేశారు. ఈ సమయంలో సంస్థ స్పందించింది. ఓపెన్ ఏఐలో పరిశోధకుడిగా పనిచేసిన సుచిర్ బాలాజీ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తీవ్ర సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా స్పందించిన అతడి తల్లి పూర్ణిమారావు.. ఓపెన్ ఏఐ పై సంచలన ఆరోపణలు చేశారు.. పలు ప్రశ్నలు సంధించారు.. తన కుమారుడి మృతిని అధికారులు కేవలం 14 నిమిషాల్లో ఆత్మహత్యగా తేల్చేశారని అన్నారు. ఈ సమయంలో తాజాగా ఓపెన్ ఏఐ సంస్థ స్పందించింది. ఇందులో భాగంగా... సుచిర్ బాలాజీ తమ బృందంలో కీలక సభ్యుడిగా కొనసాగారని.. అతడి మృతి తమను ఎంతగానో కలిచివేసిందని తెలిపారు. ఈ సందర్భంగా ఈ కేసులో ఏదైనా సాయం అవసరం అయితే అది చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని.. దీనిపై ఇప్పటికే శాన్ ఫ్రాన్సిస్కో పోలీసులను సంప్రదించినట్లు తెలిపారు. కాగా... సుచిర్ బాలాజీ అనుమానాస్పద మృతి విషయంలో ఓపెన్ ఏఐ పై అతడి తల్లి పూర్ణిమారావు సంచలన ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా.. తన కుమారుడిని ఆ సంస్థే హత్య చేసిందని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. ఆ సంస్థకు వ్యతిరేకంగా తన కుమారుడి వద్ద ఆధారాలు ఉన్నాయని.. ఆ కారణంగానే తన బిడ్డను పొట్టనపెట్టుకున్నట్లు ఆమె ఆరోపించారు. ఇదే సమయంలో... కేవలం 14 నిమిషాల వ్యవధిలోనే తన కుమారుడి మృతిని ఆత్మహత్యగా అధికారులు తేల్చేశారని.. తన కుమారుడు చనిపోవడానికి ఒకరోజు ముందు తన బర్త్ డే వేడుకలు జరుపుకున్నాడని.. అతడికి ఆత్మహత్య ఆలోచన ఉంటే ఆ వేడుకలు జరుపుకునేవాడా అని ఆమె అన్నారు. ఈ నేపథ్యంలోనే ఓపెన్ ఏఐ స్పందించింది.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు..
## మంత్రులు పొంగులేటి.. తుమ్మల.. ఉత్తమ్




**హైదరాబాద్-నవభూమి:** అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు జారీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతరం ప్రక్రియ అని, చివరి లబ్ధిదారుల వరకు అందిస్తామని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి చెప్పారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు విషయమై ఎవరూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, గ్రామ సభల నిర్వహణ, తదితర అంశాలపై శనివారం డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో వారు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామ సభలలో వచ్చిన దరఖాస్తులను స్వీకరించడంతో పాటు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ప్రచారంలో ఉన్న రేషన్ కార్డుల లబ్ధిదారుల జాబితా, కులగణన (సామాజిక) సర్వే ఆదారంగా తయారు చేసిందని, ఇది తుది జాబితా కాదన్నారు.

ఈ నెల 26వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాలుగు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టబోతున్నదని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలను కొన్ని విపక్షాలు తప్పుదోవ పట్టిస్తున్నాయని, వారి ట్రాప్‌లో అధికారులు పడకూడదన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం గ్రామ సభలలో దరఖాస్తులను స్వీకరించాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా కూడా కొత్త రేషన్ కార్డుల జారీ, రేషన్ కార్డుల్లో కొత్త సభ్యుల చేరికలకు దరఖాస్తులు కూడా స్వీకరించాలని స్పష్టం చేశారు. ఇప్పటికే, గతంలో జరిగిన ప్రజాపాలన సదస్సులలో స్వీకరించిన దరఖాస్తుల జాబితాలో అర్హులైన వారిని గుర్తించే ప్రక్రియ పురోగతిలో ఉందని తెలిపారు.

ఈనెల 26 ప్రారంభించే నాలుగు పథకాలపై 21 నుండి ప్రారంభమయ్యే గ్రామసభల్లో ప్రజా అభిప్రాయాలు/ ఫీడ్ బ్యాక్ లను తీసుకోవడంతో పాటు ఈ గ్రామ సభలు, ప్రజా పాలన సేవా కేంద్రాలలో కొత్తగా తీసుకున్న దరఖాస్తులు, ఎండీఓ కార్యాలయంలో గల దరఖాస్తులను పరిశీలించాకే అర్హులైన లబ్ధిదారుల తుది జాబితాను ప్రకటిస్తామని మంత్రులు పొంగులేటి, తుమ్మల, ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అర్హుల తుది జాబితాలను ప్రకటించడానికి ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు జారీ చేస్తుందన్నారు.ఇందిరమ్మఇండ్ల కేటాయింపు విషయమై ఇంటి స్థలం ఉన్న వారి జాబితా, ఇంటి స్థలం లేని వారి జాబితాలను గ్రామ సభలలో ప్రదర్శించాలన్నారు. కొత్తగా గ్రామ సభలలో వచ్చే దరఖాస్తులను కూడా పరిశీలించాలని సూచించారు.రాష్ట్రంలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ రేషన్ కార్డులను ఇస్తామని మంత్రులు పొంగులేటి, తుమ్మల, ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రేషన్ కార్డుల మంజూరుకు దరఖాస్తులను స్వీకరించే ప్రక్రియ నిరంతరం కొన సాగుతుందని స్పష్టం చేశారు. వ్యవసాయ యోగ్యమైన భూమికి రైతు భరోసా కల్పిస్తామన్నారు. గతంలో వివిధ ప్రాజెక్టులకు, రహదారులకు, ఇతర ప్రభుత్వ అవసరాలకు ప్రభుత్వం సేకరించిన భూముల వివరాలు తహసీల్దార్ల వద్ద ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ అధికారులు, రెవిన్యూ అధికారులు సంయుక్తంగా రైతు భరోసా లబ్దిదారులను గుర్తించాలన్నారు.ఉపాధి హామీ పథకంలో కనీసం ఇరవై రోజుల పాటు కూలి పనికి వెళ్లిన వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింప చేయడం జరుగుతుందని మంత్రులు పొంగులేటి, తుమ్మల, ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రతీ కుటుంబంలో మహిళల బ్యాంకు ఖాతాలకే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మొత్తం బదిలీ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇటీవల రాష్ట్రంలో 156 గ్రామాలను మున్సిపాలిటీలలో కలపడం జరిగిందని, ఈ గ్రామాల్లో 2023 -24 లో జరిగిన ఉపాధి హామీ పనుల జాబితాను పరిగణనలో తీసుకోవడం జరుగుతుందని వారు స్పష్టం చేశారు.

# బ్యాంకులోనే పురుగుల మందు తాగేసిన రైతు..
## చోద్యం చూసిన సిబ్బంది, కూర్చున్న చోటే మృతి



**హైదరాబాద్-నవభూమి:** ఆదిలాబాద్‌లో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. బ్యాంకు అధికారులు వేధిస్తున్నారని.. ఓ రైతు అదే బ్యాంకులో అందరూ చూస్తుండగానే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. హుటాహుటిన ఆస్పత్రికి తరలించినా ఆ రైతు ప్రాణం దక్కలేదు. అయితే.. రైతు ఆత్మహత్య చేసుకున్న దృశ్యాలు.. బ్యాంకులోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాగా.. ఈ రైతుది ఆత్మహత్య కాదని.. ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు.ఆదిలాబాద్ పట్టణంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బ్యాంకులోనే ఓ రైతు.. పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు బ్యాంకులో సీసీ కెమెరాల్లో రికార్డు కాగా.. ఆ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే.. బ్యాంకు అధికారులు తనను వేధిస్తున్నారంటూ సదరు రైతు.. ఇలా బ్యాంకులోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.పట్టణంలోని ఐసీఐసీఐ బ్యాంకులో బేల మండలం రేణి గూడ కు చెందిన రైతు జాదవ్ దేవరావు ఐదెకరాల వ్యవసాయ భూమిపై మూడున్నర లక్షల రూపాయల రుణం తీసుకున్నాడు. తీసుకున్న రుణానికి గానూ.. 6 నెలలకు ఒకసారి రూ.25 వేలు వడ్డీ చెల్లించాల్సి ఉంది. అయితే గత 2 దఫాలుగా వడ్డీ చెల్లించలేక పోయాడు. సమయానికి వడ్డీ కట్టకపోవడంతో.. బ్యాంకు అధికారులు జాదవ్‌పై ఒత్తిడి తీసుకొచ్చారు. ఫోన్లు చేసి వేధించారు. అటు వడ్డీ కట్టేందుకు డబ్బులు లేక.. ఇటు బ్యాంకు అధికారులు వేధింపులు తట్టుకోలేక.. జాదవ్ తీవ్ర మనస్తాపానికి లోనయ్యాడు.దీంతో శనివారం (జనవరి 18న) ఉదయం పురుగుల మందు డబ్బాతో బ్యాంకుకు వచ్చిన జాదవ్.. నేరుగా లోపలికి వచ్చి పురుగుల మందు తాగేసి.. బాటిల్‌ను విసిరేశాడు. అది గమనించిన సెక్యూరిటీ గార్డు తనను బయటికి వెళ్లాలంటూ వారించగా.. వెళ్లి ఆ సెక్యూరిటీ గార్డు కుర్చీలో జాదవ్ కూర్చున్నాడు. అంతలోనే మరో సిబ్బంది వచ్చి.. ఏం జరిగిందని అడగటంతో.. పురుగుల మందు తాగేసినట్టు చెప్పాడు. అప్పటికీ ఆ ఇద్దరు ఎవరికీ చెప్పకుండా వాళ్లలో వాళ్లే మాట్లాడుకున్నారు. తీరిగ్గా మిగతా సిబ్బంది ఒక్కొక్కరుగా అక్కడికి వచ్చి విషయం తెలుసుకుంటూ సినిమా చూశారే తప్ప.. ఒక్కరు కూడా ఆయనను ఆస్పత్రికి తీసుకెళ్లాలన్న ప్రయత్నం చేయకపోవ టం శోచనీయం. అందులో ఓ ఉద్యోగి.. అంబులెన్సుకు ఫోన్ చేసి.. సమా చారం ఇవ్వగా.. అది వచ్చే వరకు ఎదురు చూశారే తప్ప.. వాళ్ల సొంత వాహనంలో తీసుకెళ్లేందుకు ఎవరూ ముందుకు రాకపో వటం బాధాకరం. అంబులెన్స్ వచ్చిన తర్వాతే.. జాదవ్‌ను రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. జాదవ్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అయితే.. బ్యాంకు సిబ్బంది టైం వేస్ట్ చేయకుండా సకాలంలో స్పందించి ఉంటే జాదవ్ కచ్చితంగా బతికేవాడని సీసీ కెమెరా వీడియోలు చూస్తుంటే అర్థమవుతోంది.జాదవ్ మృతితో అతని కుటుంబ సభ్యులు, బంధువులు బ్యాంకు ముందు ఆందోళనకు దిగారు. లోన్ చెల్లించడం లేదని జాదవ్‌ను బ్యాంక్ అధికారులే పిలిచారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. బ్యాంకు అధికారుల వేధింపులు తట్టుకోలేకనే జాదవ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి.. బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నారు.జాదవ్ మృతిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు స్పందించారు. రైతులందరికీ రుణమాఫీ చేసేశామని సీఎం రేవంత్ రెడ్డి చెప్తున్నారని గుర్తు చేసిన హరీష్ రావు.. రుణమాఫీ పూర్తయితే ఆదిలాబాద్ జిల్లాలో ఓ రైతు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారని ప్రశ్నించారు. ఇది ముమ్మాటికీ రేవంత్ ప్రభుత్వం చేసిన హత్యేనని హరీశ్ రావు విమర్శించారు. అప్పు కట్టాలని వేధింపులకు గురిచేస్తే రైతు బ్యాంకులోనే పురుగుల మందు తాగి చనిపోయాడని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చెప్తున్నట్టు రుణమాఫీ అయిపోతే జాదవ్ అనే రైతు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడని హరీష్ రావు ప్రశ్నించారు.రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ సర్కార్ చేసిన మోసం వల్లే రైతు చనిపోయాడని హరీష్ రావు ఆరోపించారు. రుణమాఫీ, రైతు భరోసా, పంట బోనస్ ఇలా అన్ని విషయాల్లో రేవంత్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందన్నారు. ఇప్పుడు రేషన్ కార్డులు ఇవ్వకుండా పేదల ఉసురుతీస్తున్నారని ధ్వజమెత్తారు. ఆత్మహత్య చేసుకున్న రైతు జాదవ్ కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారం ఇవ్వాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ తరపున రైతు జాదవ్ దేవరావు కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికంగా ఆదుకుంటామని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# తెలంగాణ మావోయిస్టు కార్యదర్శి

**(1వపేజీ తరువాయి)**మావోయిస్టు తెలంగాణ కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్న బడే చొక్కారావు అలియాస్ దామోదర్ పోలీసు కాల్పుల్లో మృతి చెందినట్లు తాజాగా మావోయిస్టు పార్టీ వెల్లడించింది. చొక్కారావుపై గతంలో రూ. 50 లక్షల రివార్డు ఉంది. బడే చొక్కారావు అలియాస్ దామోదర్ స్వస్థలం ములుగు జిల్లా కాల్వపల్లి. బీజాపూర్ ఎన్ కౌంటర్‌లో మొత్తం 18 మంది మావోయిస్టులు మరణించినట్లు మావోయిస్టు పార్టీ ఓ ప్రకటనలో పేర్కొంది. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా గతంలో వ్యవహరించిన యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ 2021లో కోవిడ్ బారినపడి మరణించాడు. అప్పట్నుంచి ఆ స్థానం ఖాళీగా ఉంది. అయితే, ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు మావోయిస్టు పార్టీ పలువురి పేర్లు పరిశీలించింది. ఈ క్రమంలో ఆజాద్ పేరు వినిపించినప్పటికీ.. చివరకు చొక్కారావు పేరు ఖరారైంది. తెలంగాణ జిల్లాల్లో మంచి పట్టున్న చొక్కారావు.. ఏటూరునాగారం, ములుగు, మహబూబాబాద్ ప్రాంతాల్లో యాక్టివ్ గా పనిచేశారు. మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా బడే చొక్కారావు నియామకంతో రాష్ట్రంలో మావోయిస్టు కార్యకలాపాల పునరుద్ధరణకు కొంత సహాయపడింది. ఈ నేపథ్యంలో తాజాగా ఎన్‌కౌంటర్‌లో చొక్కారావు మృతి చెందడం మావోయిస్టు పార్టీకి భారీ నష్టమేనని చెప్పవచ్చు. కాగా, భారీ ఎన్‌కౌంటర్ అనంతరం భద్రతా బలగాలు భారీ ఎత్తున మావోయిస్టుల ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాయి. మరో భారీ బంకర్ ను గుర్తించాయి. ఇందులో సొరంగల్ దేశవాళీ రాకెట్ లాంచర్లు, పెద్దఎత్తున యంత్రాలు, మందుగుండు సామాగ్రి, విద్యుత్ లైన్ నిర్మించే సిల్వర్ వైర్లు లభించాయి.

# 20న సంజయ్‌కు శిక్ష ఖరారు

**కోల్‌కతా-నవభూమి:** దేశవ్యాప్తంగా పెను సంచలనం రేపిన ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలిపై హత్యాచారం కేసులో కోల్కతాలోని సీల్దా కోర్టు శనివారం తీర్పు వెలువరించింది. ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ను. దోషిగా తేల్చింది. అతడికి జనవరి 20న శిక్ష ఖరారు చేయనుంది . "నీకు శిక్ష తప్పదు. బాధితురాలిని నీవు చంపిన తీరుకు యావజ్జీవ కారాగార శిక్ష లేక మరణశిక్ష విదించవచ్చు. సోమవారం శిక్షఖరారు చేస్తాం" అని న్యాయమూర్తి అన్నారు. సీబీఐ సమర్పించిన ఆధారాల మేరకు సంజయ్ను కోర్టు దోషిగా తేల్చింది. తీర్పు నేపథ్యంలో భారీ భద్రత మధ్య సంజయ్ను కోర్టుకు తీసుకువచ్చారు. తాను ఏ తప్పూ చేయలేదని, తనను తప్పుడు కేసులో ఇరికించారని ఈ సందర్భంగా జడ్జికి సంజయ్ తెలిపాడు.

# ఉగాది నుంచి 'గద్దర్' అవార్డులు

**(1వపేజీ తరువాయి)**నాయకత్వంలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్న ట్టు తెలిపారు. రాష్ట్రంలో సినిమాల నిర్మాణాన్ని ప్రోత్సహించే అవార్డులను ప్రతి ఏటా అందజేయాలని నిర్ణయించి గద్దర్ తెలంగాణ సినిమా అవార్డులు ఈ ఉగాది నుంచి ప్రతి సంవత్సరం ఇవ్వనున్నట్లు ప్రకటించారు.ఫీచర్ సినిమాలు, బాలల చిత్రాలు, తెలుగు సినిమాపై పుస్తకాలు తదితర వివిధ విభాగాల కింద అవార్డులు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. అవార్డుల్లో నగదు పురస్కారంతో పాటు ప్రశంసా పత్రం కూడా అందజేయనున్నట్లు చెప్పారు. గద్దర్ అవార్డుకు సంబంధించి లోగోను కూడా రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో టీఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజు, ఎండీ డాక్టర్ హరీశ్, ఈడీ కిశోర్‌బాబు, కమిటీ చైర్మన్ బీ నర్సింగ్‌రావు, కమిటీ సభ్యులు జయసుధ, తమ్మారెడ్డి భరద్వాజ్, హరీశ్ శంకర్, వందేమాతరం శ్రీనివాస్, గుమ్మడి వెన్నెల, అల్లాణి శ్రీధర్, వేణు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాల్సిందే

**(1వపేజీ తరువాయి)**తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించేందుకు హైదరాబాద్ నగరంలోని ఎన్టీఆర్ ఘాట్‌కు ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ వెళ్లారు. ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్ గోడలు, పైకప్పు పెచ్చులూడిపోవడం, గార్డెన్‌లో ఏర్పాటు చేసిన లైట్లు విరిగిపడి ఉండటాన్ని గమనించారు మంత్రి లోకేష్. ఈ క్రమంలో ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణపై మంత్రి నారా లోకేష్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో సొంత నిధులతో మరమ్మతులు చేపట్టాలని తన సిబ్బందిని ఆదేశించారు. అవసరమైన అనుమతులు తీసుకుని వీలైనంత తొందరగా ఘాట్ మరమ్మతులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వెంటనే పనులు ప్రారంభించాలని తన సిబ్బందిని ఆదేశించారు. "మీ రుణం తీర్చుకోలేను - లోకేష్ ఎమోషనల్..!!" ఘాట్ నిర్వహణ బాధ్యతలను ఎన్టీఆర్ ట్రస్టుకు అప్పగించాలని పలుమార్లు తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని ఈ సందర్భంగా మంత్రి లోకేష్ తెలిపారు. మరోవైపు, ఘాట్ నిర్వహణ బాధ్యతలు చూడాల్సిన హెచ్ఎండీఏ తీరు పట్ల ఎన్టీఆర్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ అంటే కేవలం మూడు అక్షరాలు కాదు.. అదొక ప్రభంజనం అని మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. ప్రజల గుండెల్లో ఆయన స్థానం దేవుడు. నటుడుగా అయినా నాయకుడిగా అయినా ఎన్టీఆర్ గారే నంబర్ 1. తెలుగోడి పవర్ ఢిల్లీ కి చూపించింది ఎన్టీఆర్. ఎస్సి, ఎస్టీ, బీసీ మైనార్టీలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఇచ్చింది ఎన్టీఆర్. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, పక్కా ఇళ్లు, జనతా వస్త్రాలు, మధ్యాహ్న భోజన పథకం, రూ. 2 కే కిలో బియ్యం. దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసింది ఎన్టీఆర్. ఆయన ఒక్కరితో ప్రారంభమైన ప్రయాణం నేడు కోటి మందితో అతి పెద్ద కుటుంబంగా మారింది. కోటి సభ్యత్వాలతో ఆయనకు ఘన నివాళులు అర్పించినట్లు లోకేష్ పేర్కొన్నారు.

తెలంగాణలో టీడీపీ బలోపేతం చేస్తాం తెలంగాణలో తెలుగుదేశం పార్టీ పునర్నిర్మాణంపై చర్చిస్తున్నామని, త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని మంత్రి లోకేష్ తెలిపారు. తెలంగాణలో 1.60 లక్షల మంది పార్టీ సభ్యత్వం తీసుకున్నారని, టీడీపీపై తెలంగాణ ప్రజలకు ప్రేమ, ఆశ ఉందన్నారు. తెలంగాణలో టీడీపీని బలోపేతం చేయడమే తమ లక్ష్యమని లోకేష్ చెప్పారు.

# ఏపీలో మెగా స్కెచ్

**(1వపేజీ తరువాయి)**ప్రాధాన్యత జగన్ సీఎంగా ఉన్న సమయంలో నర్సాపురంలో అల్లూరి సీతారామ రాజు విగ్రహావిష్కరణ వేళ చిరంజీవికి ప్రాధాన్యత దక్కింది. అదే విధంగా అయోధ్య రామాలయ ప్రారంభానికి ప్రత్యేకంగా ఆహ్వానం అందింది. ఇక, తాజాగా ఢిల్లీ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇంట జరిగిన సంక్రాంతి వేడుక ల్లో చిరంజీవి హాజరయ్యారు. అక్కడ ప్రధాని - మెగా కాంబినేషన్ పైన ఏపీ భవిష్యత్ రాజకీయాల పైన చర్చ మొదలైంది. ఆర్ఆర్ఆర్ కు ఆస్కార్ అవార్డు తరువాత అమిత్ షాతో చిరంజీవి, రామ్ చరణ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇక.. ఇప్పుడు చిరంజీవికి బీజేపీ నాయకత్వం నుంచి తాజా ఆఫర్ వచ్చినట్లు పొలిటికల్ సర్కిల్స్ లో ప్రచారం సాగుతోంది. దీని పైన ఇప్పుడు చిరంజీవి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. బీజేపీ మెగా వ్యూహం రాజకీయంగా ఏపీతో పాటుగా జాతీయ స్థాయిలోనూ సత్తా చాటాలని పవన్ భావిస్తున్నారు. ఇందు కోసం మోదీ నాయకత్వానికి మద్దతుగా నిలుస్తున్నారు. తిరుమల లడ్డూ వివాదం వేళ సనాతన హిందూ ధర్మం గురించి చర్చ ద్వారా పవన్ దేశ వ్యాప్తంగా వార్తల్లో నిలిచారు. ఇప్పుడు రాజకీయం గా ఎదిగే అవకాశం సద్వినియోగం చేసుకోవాలని భావిస్తున్నారు. అందులో భాగంగా కేంద్ర మంత్రి వర్గంలోకి చిరంజీవి చేరనున్నారనే వార్తలు ఢిల్లీలో వైరల్ అవుతున్నాయి. గతంలోనూ చిరంజీవి కాంగ్రెస్ లో కేంద్ర మంత్రిగా పని చేసారు. చిరంజీవి కేంద్ర మంత్రిగా వచ్చిన ప్రతిపాదనకు అంగీకరిస్తే జనసేన నుంచి రాజ్యసభకు ఎంపిక చేయాలనేది పవన్ ప్లాన్ గా చెబుతున్నారు. దీంతో, మరో రెండు నెలల్లో ఏపీ కేంద్రంగా మెగా బ్రదర్స్ రాజకీయ భవిష్యత్ లో కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశం కనిపిస్తోంది.

# రేపు దావోస్ పర్యటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి-నవభూమిబ్యూరో**

బ్రాండ్ ఏపీ ప్రమోషన్ తో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు సాధించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దావోస్ లో జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సుకు రేపు (జనవరి 19) బయల్దేరి వెళుతున్నారు. ప్రపంచ బిజినెస్ దిగ్గజాలు వచ్చే ఈ సదస్సులో భాగస్వాములు అవ్వడం ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో పెట్టుబడుల సాధనకు సీఎం చంద్రబాబు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. దేశానికి సంబంధించి పలు దిగ్గజ సంస్థలతో పాటు గూగుల్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు కూడా ఇప్పటికే ఏపీలో పెట్టుబడులపై ఒప్పందాలు చేసుకున్నాయి. ఇప్పటి వరకు రూ. 4 లక్షల కోట్ల కు పైగా పెట్టుబడులపై ఒప్పందాలు జరిగాయి. వీటిలో కొన్ని ప్రాజెక్టులకు ఇప్పటికే శంకుస్థాపనలు కూడా జరిగాయి. రానున్న రోజుల్లో అర్సెలార్ మిత్తల్ స్టీల్ పరిశ్రమ, బీపీసీఎల్ వంటి ప్రాజెక్టుల పనులు కూడా ప్రారంభం కానున్నాయి.

రాష్ట్రంలో ఉన్న మానవ వనరులు, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ రాయితీలు, సమర్థవంతమైన నాయకత్వం, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను వివరించడం ద్వారా జాతీయ అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షించేందుకు సీఎం చంద్రబాబు దావోస్ పర్యటనను వేదికగా చేసుకోనున్నారు.

ఆదివారం సాయంత్రం అమరావతి నుంచి దావోస్ ప్రర్యటనకు వెళ్లనున్నారు. సాయంత్రం 4 గంటలకు గన్నవరం ఎయిర్ పోర్టు నుంచి బయలు దేరి ముందుగా ఢిల్లీ చేరుకుంటారు. డిల్లీ నుంచి బయల్దేరి తన బృందంతో జ్యూరిచ్ కు చేరుకుంటారు. ముందుగా జ్యూరిచ్ లో ఉన్న ఇండియన్ అంబాసిడర్ తో భేటీ అవుతారు.



## బాంబులు విసిరి, కాల్పులు జరిపి గ్యాంగ్ లీడర్ బర్త్‌డే సెలబ్రేషన్.. తర్వాత ఏం జరిగిందంటే?

**లక్నో-నవభూమి:** గ్యాంగ్ లీడర్ బర్త్ డేను అతడి గ్యాంగ్ సభ్యులు వినూత్నంగా జరిపారు. బిజీ మార్కెట్‌లో బాంబులు విసిరారు. కాల్పులు జరిపి భయాందోళన సృష్టించారు. దర్యాప్తు జరిపిన పోలీసులు ఆ గ్యాంగ్ సభ్యులను అరెస్ట్ చేశారు. ఆ మార్కెట్ ప్రాంతంలో వారిని ఊరేగించారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఈ సంఘటన జరిగింది. ఒక గ్యాంగ్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు తమ లీడర్ పుట్టిన రోజును వినూత్నంగా జరుపుకున్నారు. జనవరి 15న



కాన్పూర్‌లోని లాల్ బంగ్లా ప్రాంతంలో ఉన్న రద్దీ మార్కెట్ వద్ద అలజడి సృష్టించారు. అక్కడ బాంబులు విసరడంతోపాటు కాల్పులు జరిపారు. దీంతో వ్యాపారులు భయాందోళన చెందారు.కాగా, ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఈ సంఘటనపై దర్యాప్తు జరిపారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు.

అక్కడ బాంబులు విసిరి కాల్పులు జరిపిన నిందితులను గుర్తించారు. గ్యాంగ్ సభ్యులైన 18 ఏళ్ల సాహిల్, 27 ఏళ్ల దేబు కుమార్ వాల్మీకి, 23 ఏళ్ల రజ్జుల్లాను అరెస్ట్ చేశారు. వారిని ఆ మార్కెట్ వద్దకు పోలీసులు తీసుకెళ్లారు. అక్కడి వ్యాపారులు చూస్తుండగా నిందితులను ఊరేగించారు.

## సంజయ్ ఒక్కడే దోషి కాదు.. మిగతా వారిని అరెస్ట్ చేయలేదు: బాధితురాలి తల్లి



**కోల్‌కతా-నవభూమి:** ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం కేసులో సంజయ్ రాయ్ దోషిగా తేలడంపై బాధితురాలి తల్లి స్పందించింది. అతడు ఒక్కడే నిందితుడు కాదని తెలిపింది. నేరానికి పాల్పడిన మిగతా వారిని ఇంకా అరెస్ట్ చేయలేదని ఆమె ఆరోపించింది. సంజయ్ సహచరులు, ఇతర నేరస్థులను అరెస్ట్ చేసి శిక్షించే వరకు న్యాయం కోసం తాము ఎదురు చూస్తామని చెప్పింది. 'సంజయ్ దోషి అని జీవసంబంధమైన ఆధారాల ద్వారా నిరూపితమైంది. కోర్టులో విచారణల సమయంలో అతడు మౌనంగా ఉన్నాడు. నా కుమార్తెను హింసించి చంపడంలో అతడి పాత్రను ఇది నిరూపించింది. కానీ అతడు ఒంటరిగా లేడు. ఇతరులను ఇంకా అరెస్టు చేయలేదు. కాబట్టి, మాకు ఇంకా న్యాయం జరుగలేదు' అని మీడియాతో ఆమె అన్నారు.

మరోవైపు, ఈ కేసు విచారణ ఇంకా పూర్తి కాలేదని బాధితురాలి తల్లి తెలిపింది. తాను, తన భర్త జీవించే చివరి రోజు వరకు న్యాయం కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని ఆమె చెప్పింది. 'కేసు పూర్తి కాలేదు. మా కుమార్తె హత్యాచారంలో పాల్గొన్న ఇతర నిందితులకు శిక్ష పడిన తర్వాత మాత్రమే ఇది పూర్తవుతుంది. ఆ రోజు కోసం మేం వేచి ఉంటాం. ఆ రోజు వరకు మేం నిద్రపోలేం. మేం కోరుకునేది అదే' అని ఆమె అన్నారు.కాగా, గత ఏడాది ఆగస్టు 9న కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో రాత్రి విధుల్లో ఉన్న జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం జరిగింది. దేశ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తిన ఈ కేసులో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌ను దోషిగా సీల్దా సీబీఐ కోర్టు శనివారం నిర్ధారించింది. జనవరి 20న అతడికి శిక్షలు ఖరారు చేస్తామని కోర్టు వెల్లడించింది.

## ఢిల్లీలో అద్దెదారులకు విద్యుత్, తాగు నీరు ఉచితం.. కేజ్రీవాల్ ఎన్నికల హామీ




**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ మరో ఎన్నికల హామీ ప్రకటించారు. ఢిల్లీలో నివసించే అద్దెదారులకు విద్యుత్, తాగు నీరు ఉచితంగా అందిస్తామని తెలిపారు. శనివారం మీడియా సమావేశంలో అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడారు. 'మేం ఢిల్లీ నివాసితులకు ఉచిత విద్యుత్, ఉచిత తాగు నీరు అందించాం. అయితే అద్దెదారులకు ఈ ప్రయోజనాలు లభించకపోవడం దురదృష్టకరం. ఎన్నికల తర్వాత మా ప్రభుత్వం ఏర్పడితే, అద్దెదారులకు కూడా ఉచిత విద్యుత్, తాగు నీరు అందించే వ్యవస్థను ప్రవేశపెడతాం' అని అన్నారు. కాగా, ఢిల్లీలో నివసిస్తున్న చాలా మంది అద్దెదారులు పూర్వాంచల్‌కు చెందినవారని అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. వారిలో చాలా మంది చాలా పేదవారని చెప్పారు. వారు ఎలాంటి సబ్సిడీలు పొందలేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. దీనిని పరిష్కరించడానికి తాము ప్రయత్నిస్తామని కేజ్రీవాల్ తెలిపారు. మళ్ళీ అధికారంలోకి వస్తే ఢిల్లీలోని ఇంటి అద్దెదారులకు కూడా ఉచిత విద్యుత్, ఉచిత తాగు నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు.మరోవైపు ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఫిబ్రవరి 8న కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తారు. అయితే ఈ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించి మూడోసారి అధికారంలోకి రావాలని ఆప్ ఆశిస్తున్నది.

## సోషల్ మీడియాలో పాకిస్థాన్ అనుకూల పోస్టు.. యూపీ యువకుడి అరెస్టు



**లక్నో-నవభూమి:** సామాజిక మాధ్యమాల్లో పాకిస్థాన్ అనుకూల నినాదాలు పోస్టు చేసిన వ్యక్తిని ఉత్తరప్రదేశ్ పోలీసులు అరెస్టు చేశారు. యూపీలోని బరేలీలో ఉన్న నవాబ్‌గంజ్ ప్రాంతానికి చెందిన ఇమ్రాన్ అనే వ్యక్తి తన సోషల్ మీడియా అకౌంట్‌లో పాకిస్థాన్ జిందాబాద్ అని రాసి పోస్టు చేశాడు. అదికాస్తా వివాదానికి దారితీసింది. తమ మనోభావాలు దెబ్బతీసేలా పోస్టు చేశాడంటూ వినియోగదారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీంతో రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆధారాలను సేకరించిన తర్వాత ఇమ్రాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రజల మనోభావాలను కించపరిచేలా తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో పాకిస్థాన్ జిందాబాద్ అంటూ స్లోగన్‌ను పోస్టు చేసినందుకు అతడిని అరెస్టు చేశామని బరేలీ ఇన్‌స్పెక్టర్ రాజ్ కుమార్ శర్మ తెలిపారు. ఈ ఘటనలో దర్యాప్తు కొనసాగుతున్నదని వెల్లడించారు.

## లండన్‌లో నెలకు రూ.లక్ష ఇంటి అద్దె కడుతున్నా తప్పని ఇక్కట్లు.. ఎన్నారై వీడియో వైరల్

**లండన్-నవభూమి:** లండన్‌లో ఉంటూ ఇంటికి నెలకు రూ.లక్ష అద్దె చెల్లిస్తున్న వ్యక్తి అక్కడ పైకప్పు నుంచి నీరు లీకవుతుంటే విసిగిపోయాడు. చివరకు తన ఆవేదనను నెట్టింట పంచుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం తెగ వైరల్ అవుతోంది.

ఇంటర్నెట్ డెస్క్: ప్రపంచ ప్రఖ్యాత నగరాల్లో లండన్ కూడా ఒకటి. చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యత కలిగిన ఈ నగరంలో భారతీయులు అనేక మంది ఉంటున్నారు. ఏటా అనేక మంది ఎన్నో కలలతో చదువులు, ఉద్యోగాల కోసం లండన్‌కు తరలిపోతున్నారు. సరిగ్గా ఇలాగే లండన్‌కు వెళ్లిన ఓ భారతీయ యువకుడు తాను పడుతున్న కష్టాలు చెప్పుకుంటూ నెట్టింట పంచుకున్న ఓ వీడియో ప్రస్తుతం తెగ వైరల్ అవుతోంది. జనాలు ఆశ్చర్యపోయేలా చేస్తోంది ఆర్యన భట్టాచార్య అనే యువకుడు ఈ వీడియో పోస్టు చేశారు.

## 30 ఏళ్లుగా ఏ కార్యక్రమమైనా అక్కడి నుంచే స్టార్ట్..



**విజయవాడ-నవభూమి:** కృష్ణా జిల్లా మారేడుమాక గ్రామ ప్రజల ఎదురుచూపులు ఫలించాయి. 30 ఏళ్లకు ఆ ఊర్లోకి ఆర్టీసీ బస్సు వచ్చింది. గత 30 ఏళ్లుగా తమ ఊరికి ఆర్టీసీ బస్సు నడపాలని ఆ ఊరి జనం కోరుతూ వస్తున్నారు. అయితే రోడ్డు సరిగా లేకపోవటం, ప్రయాణికుల సంఖ్య తక్కువ కావటంతో ఆర్టీసీ ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. తాజాగా రోడ్డును బాగు చేయటంతో ఊరిజనం మరోసారి వినతి పత్రం సమర్పించారు. దీంతో ఆర్టీసీ అధికారులు స్పందించి ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేశారు. శుక్రవారం ఊర్లోకి తొలిసారిగా బస్సు రావటంతో ఊరిజనం సంతోషం వ్యక్తం చేశారు.


కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గం కంకిపాడు మండలంలోని మారేడుమాక గ్రామ ప్రజల నిరీక్షణ ఫలించింది. ఈ ఊరి జనాల 30 ఏళ్ల నిరీక్షణకు తెరపడింది. మారేడుమాక గ్రామం ఈశాన్యం దిక్కులో ఉంటుంది. దీంతో ఇక్కడ ఏదైనా కార్యక్రమం తలపడితే శుభప్రదమవుతుందని స్థానికులు, ఈ నియోజకవర్గ ప్రజల నమ్మకం. దీంతో రాజకీయ నేతల నుంచి అధికార యంత్రాంగం వరకూ ఈ నియోజకవర్గ పరిధిలో చేపట్టే ఏ కార్యక్రమాన్నైనా ఇక్కడి నుంచే మొదలుపెడతారు. ఎన్నికల ప్రచారం మొదలుకుని, ప్రభుత్వ కార్యక్రమాల వరకూ ఏ పని అయినా ఇక్కడి నుంచే మొదలు. గత 30 ఏళ్లుగా ఈ ఆనవాయితీ కొనసాగుతోంది. అయితే ఈ 30 ఏళ్లుగా ఈ ఊరిజనం కూడా అధికారులను ఓ కోరిక కోరుతూ వచ్చారు.ఎన్నికలు జరిగిన ప్రతి సారీ తమ ఊరికి ఆర్టీసీ బస్సు వేయాలని ప్రజాప్రతినిధులను కోరుతూ వచ్చారు. అయితే వివిధ కారణాలతో ఈ దిశగా అడుగులు పడలేదు. మారేడుమాక రహదారి బాగా లేకపోవటంతో పాటుగా ఊరి నుంచి ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉండడంతో గ్రామ ప్రజల డిమాండ్‌ను ఆర్టీసీ అధికారులు పట్టించుకోలేదు. దీంతో తమ ఊరికి బస్సు కావాలన్న ఆ ఊరి జనం కల.. 30 ఏళ్లుగా అలా అపరిష్కృతంగానే ఉంటూ వచ్చింది. అయితే తాజాగా మారేడుమాక గ్రామ రహదారిని అధికారులు బాగు చేశారు. రహదారికి మరమ్మత్తులు చేపట్టారు. దీంతో రోడ్డు బాగుపడటంతో మారేడుమాక ఊరి జనం మరోసారి తమ వినతిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ద్వారా మారేడుమాక ప్రజలు వినతిపత్రం సమర్పించారు. ఈ వినతిపై స్పందించిన ఏపీఎస్ఆర్టీసీ అధికారులు మారేడుమాక గ్రామానికి బస్సును ఏర్పాటు చేశారు. తెన్నేరు-కాళేశ్వరరావు మార్కెట్ బస్సు సర్వీసును మారేడుమాక వరకు పొడిగించారు. రోజుకు మూడు రౌండ్లు తిరిగేలా ఏర్పాటు చేశారు. శుక్రవారం బస్సు ఊర్లోకి రావటంతో మారేడుమాక గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులకు, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఊర్లోకి బస్సు సౌకర్యం ఏర్పాటు కావటంతో విద్యార్థులు, వ్యాపారులు, స్థానికులకు ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

**ఆర్టీసీ బస్సులోనే హఠాన్మరణం**

మరోవైపు మచిలీపట్నం డిపోలో.. ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడు హఠాన్మరణం చెందాడు. మృతుడు గూడూరు మండలం పిండివారిపాలెనికి చెందిన సిరివెళ్ల వెంకటేశ్వరరావుగా గుర్తించారు. 60 ఏళ్ల వెంకటేశ్వరరావు ఏడాది కింద బైపాస్ సర్జరీ చేయించుకున్నారు. డాక్టర్ చెకప్ కోసం విజయవాడ వెళ్లేందుకు మచిలీపట్నం డిపోలో బస్సు ఎక్కారు. అయితే బస్సు బయలుదేరక ముందే సీటులోనే వెంకటేశ్వరరావు ఓ పక్కకు ఒరిగిపోయారు. బస్సులోనే ఉన్న ఓ డాక్టర్ కాపాడే ప్రయత్నం చేసినా.. ఫలించలేదు.

## ఏరో ఇండియా షో.. చికెన్, మటన్ విక్రయాలు బంద్.. ఎందుకంటే?



**బెంగళూరు-నవభూమి:** బెంగళూరు వేదికగా దేశంలోనే అతిపెద్ద విమానయాన ప్రదర్శనకు ఏర్పాట్లు చకా చకా జరుగుతున్నాయి. ఫిబ్రవరి 10 నుంచి ఐదు రోజులపాటు యలహంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ఏరో ఇండియా షో 2025 జరగనుంది. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆ ప్రాంతంలో చికెన్, మటన్, చేపలు వంటి మాంసాహారం విక్రయాలు నిషేధించారు. చికెన్, మటన్ షాపులలో వీటి అమ్మకాలు బంద్ చేయాలని.. హొటళ్లలోనూ ఇలాంటి నాన్ వెజ్ వంటకాలను బంద్ చేయాలని బీబీఎంపీ అధికారులు ఆదేశించారు. ఇందుకు కారణాలు కూడా వెల్లడించారు.

కర్ణాటక రాజధాని బెంగళూరు వేదికగా ఏరో ఇండియా షో జరగనుంది. ఫిబ్రవరి 10 నుంచి 14 వరకూ ఈ ఎయిర్ షో జరుగుతోంది. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలోనే బృహత్ బెంగళూరు మహానగరపాలక సంస్థ (%దీదీవీ%) కీలక నిర్ణయం తీసుకుంది. యలహంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ చుట్టూ మాంసం దుకాణాలలో మాంసం విక్రయాలు ఆపేయాలని బీబీఎంపీ ఆదేశించింది. యలహంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ చుట్టుపక్కల 13 కిలోమీటర్ల పరిధిలోని చికెన్, మటన్ షాపులలో మాంసం విక్రయాలపై నిషేధం విధించింది. చికెన్, మటన్ దుకాణాలతో పాటుగా నాన్ వెజ్ వంటకాలు అందించే హొటళ్లు, రెస్టారెంట్లు కూడా బీబీఎంపీ ఆదేశాలను అమలు చేయాల్సి ఉంటుంది. జనవరి 23 నుంచి ఫిబ్రవరి 17 వరకు యలహంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ చుట్టూ ఈ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి.అయితే ఎయిర్ షోకు, చికెన్, మటన్ షాపులకు లింకేమిటని.. చాలా మందికి అనుమానాలు వస్తున్నాయి. ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ఎయిర్ షో జరిగితే, చికెన్ షాపులు, మటన్ దుకాణాలలో మాంసం విక్రయాలు ఎందుకు బంద్ చేయాలని.. హొటళ్లలో ఎందుకు నాన్ వెజ్ ఫుడ్ అందించకూడదనే డౌటనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ అనుమానాలకు బీబీఎంపీ అధికారులు క్లారిటీ ఇస్తున్నారు. చికెన్, మటన్ షాపులు వంటి మాంసాహారం విక్రయించే చోట్ల గద్దలు, దేగలు వంటివి తిరుగుతుంటాయని.. అందుకే ఆంక్షలు విధించినట్లు చెప్తున్నారు. ఈ గద్దలు, దేగలు ఎయిర్ షో జరిగే సమయంలో ఆ ప్రాంతంలోకి వస్తే ప్రమాదాలు జరుగుతాయనే ఉద్దేశంతో, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా బీబీఎంపీ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. బీబీఎంపీ నిర్ణయానికి ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు. అలాగే ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మరోవైపు 1996 నుంచి బెంగళూరులో ఎయిర్ షో నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 14 ఎయిర్ షోలు నిర్వహించారు. ఫిబ్రవరి 10 నుంచి 14 వరకూ ఐదు రోజుల పాటు యలహంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ఏరో ఇండియా 2025 ప్రదర్శన జరుగుతోంది. ఏరో ఇండియా షో దేశంలోనే అతిపెద్ద విమానయాన ప్రదర్శనగా చెప్తుంటారు. ఫిబ్రవరిలో జరిగే ఎయిర్ షోలో సుమారుగా 800 మందికి పైగా ఎగ్జిబిటర్లు, 53 విమానాలు పాల్గొంటాయని.. 7 లక్షలమంది సందర్శకులు వస్తారని అధికారుల అంచనా. రక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థలు, అంకుర పరిశ్రమలు, విదేశీ పెట్టుబడిదారులు ఇలా చాలా మంది ఈ ఎయిర్ షోకు హాజరవుతారు. ఈ నేపథ్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

## హైదరాబాద్ మెట్రోలో డోనార్ గుండె తరలింపు.. 13 నిమిషాల్లో 13 కిలోమీటర్ల ప్రయాణం



**హైదరాబాద్-నవభూమి:** గుండె ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీ కోసం చేపట్టిన ప్రక్రియలో.. హైదరాబాద్ మెట్రో కీలక పాత్ర పోషించింది. నగరంలోని ఎల్‌బీనగర్‌లో ఉన్న కామినేని ఆస్పత్రి నుంచి దాత గుండెను.. లక్డీకపూల్‌లో ఉన్న గ్లెనిగేల్స్ గ్లోబల్ ఆస్పత్రికి అత్యంత వేగంగా తరలించారు. దీని కోసం హైదరాబాద్ మెట్రో సంస్థ గ్రీన్‌కారిడార్‌ను ఏర్పాటు చేసింది. ఎటువంటి ఆటంకాలు, ఆలస్య లేకుండా.. అతివేగంగా దాత గుండెను ట్రాన్స్‌పోర్ట్ చేసింది. గ్రీన్ కారిడార్ ద్వారా సుమారు 13 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 13 నిమిషాల్లోనే చేరుకున్నారు. ఈ రూట్లో 13 స్టేషన్లు దాటేశారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీ మరీ ఎక్కువగా ఉంటుంది. గుండె తరలింపులో ఆలస్యం కావొద్దు అన్న ఉద్దేశంతో మెట్రో రైలులో దాన్ని పంపింపారు. జనవరి 17వ తేదీన రాత్రి 9.30 నిమిషాల సమయంలో మెట్రో రైలు ద్వారా డోనార్ గుండెను తరలించారు. చాలా సునిశితమైన ప్లానింగ్, మెట్రో రైలు.. వైద్యులు, ఆస్పత్రి వర్గాల సహకారంతో ఆ ప్రయత్నం సఫలమైనట్లు తెలుస్తోంది.

## వినీలాకాశంలో ఆవిష్కృతమవనున్న అద్భుత దృశ్యం..! 22 నుంచి ఒకే వరుసలోకి ఆరు గ్రహాలు..!




**న్యూఢిల్లీ-నవభూమి:** ఈ నెల 22న వినీలాకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతం కాబోతున్నది. ఒకే వరుసలోకి ఆరు గ్రహాలు వచ్చి కనువిందు చేయనున్నాయి. ఆయా గ్రహాలు ఎలాంటి బైనాక్యులర్ల సహాయం లేకుండానే నేరుగా చూసేందుకు అవకాశం ఉంటుంది. ఈ నెల 22వ తేదీ నుంచి 31 వరకు గ్రహాలు ఒకో వరుసలోకి రాబోతున్నాయి.

గ్రహాలు ఒకేవరుసలో చాలా అరుదుగా కనిపిస్తాయి. గ్రహాలు ఒకే వరుసలోకి రావడాన్ని ప్లానెటరీ అలైన్‌మెంట్‌గా ఖగోళ నిపుణులు పేర్కొంటున్నారు. శుక్రుడు, అంగారకుడు, బృహస్పతి, శని, యురేనస్, నెప్ట్యూన్ గ్రహాలు ఒకే వరుసలోకి రానున్నాయి. చాలా అరుదుగా గ్రహాలన్నీ ఒకే వరుసలోకి వస్తుంటాయి. ఈ దృగ్విషయాన్ని ప్లానెటరీ అలైన్‌మెంట్, పరేడ్ ఆఫ్ ప్లానెట్స్‌గా పిలుస్తుంటారు.వాస్తవానికి గ్రహాలకు మధ్య భారీగానే దూరం ఉంటాయి. గ్రహాలు ఏవీ అంతరిక్షంలో వరుస క్రమంలో ఉండవు. కానీ, మనకు భూమిపై నుంచి చూసిన సమయంలో ఒకే వరుసలో దర్శనమిస్తాయి. ఈ దృశ్యాన్ని బైనాక్యులర్స్ ద్వారా చూస్తే మాత్రం మరింత స్పష్టంగా కనిపిస్తాయి. శుక్రుడు, కుజుడు, బృహస్పతి, శని, యురేనస్, నెప్ట్యూన్‌లను చూసేందుకు ఫిబ్రవరి ప్రారంభం ఉత్తమమైన సమయంగా ఖగోళ నిపుణులు పేర్కొంటున్నారు.ఇక మార్చిలో అరుణగ్రహం, బృహస్పతి, యురేనస్, వీనస్, నెప్ట్యూన్, శని, మెర్క్యూరీ గ్రహాలు ఒకేవరుసలోకి వచ్చి కనువిందు చేయనున్నాయి. దీన్ని గ్రేట్ ప్లానెటరీ అలైన్‌మెంట్‌గా పిలుస్తారు. ఈ ఖగోళవిందును టెలిస్కోప్ సహాయం లేకుండా చూడొచ్చు. కానీ, స్పష్టంగా నాలుగు గ్రహాలు మాత్రమే కనిపిస్తాయి. నెప్ట్యూన్, యురేనస్ గ్రహాలను చూసేందుకు టెలిస్కోప్ అవసరమవుతుంది.సూర్యాస్తమయం తర్వాత రాత్రి 8.30 గంటల నుంచి ఆకాశంలో ఈ అద్భుత దృశ్యం ఆవిష్కృతమవుతుంది. ఆ సమయంలోనే అన్ని గ్రహాలు ఒకేవరుసలో దర్శనమిస్తాయి. రాత్రి 11.30 గంటల తర్వాత మళ్లీ కనిపించవు. కానీ, బృహస్పతి, మార్స్, యురేనస్ గ్రహాలు కనిపిస్తాయి. ఆ తర్వాత మళ్లీ కనిపించకుండా పోతాయి. ఈ నెల 22 నుంచి 31 వరకు ఆయా గ్రహాలను భూమిపై నుంచి నేరుగా చూడొచ్చు.శని, బుధుడు, నెప్ట్యూన్ సూర్యాస్తమయం సమయంలో సూర్యుడికి దగ్గరగా వెళ్తాయి. మెర్క్యూరీ, శని, నెప్ట్యూన్ సూర్యుడికి చాలా దగ్గరగా వెళ్లడంతో గ్రహాలు భూమిపైకి కనిపించడం తగ్గిపోతుంది. శుక్ర గ్రహం సైతం అంతగా కనిపించేందుకు ఛాన్స్ ఉండదు. బృహస్పతి, అంగారకుడు, యురేనస్ సైతం మాత్రమే కొద్దివారాల పాటు అలాగే ఉంటాయి.ఈ అరుదైన దృశ్యాన్ని అమెరికా, మెక్సికో, కెనడా, భారత్‌లో చూసేందుకు అవకాశం ఉంది. జనవరి 22 నుంచి 31 వరకు మాత్రమే స్పష్టంగా కనిపిస్తాయి. ఆయా గ్రహాలను చూసేందుకు వీలైనంత వరకు ఎక్కువగా చీకటిగా ఉండే ప్రాంతాలకు వెళ్లడం మంచిది. ఎందుకంటే లైట్ల వెలుతురులో అంత స్పష్టంగా కనిపించకపోవచ్చు. అందుబాటులో టెలిస్కోప్ ఉంటే గ్రహాలను మరింత స్పష్టంగా తిలకించేందుకు అవకాశం ఉంటుంది. మరి మీరు కూడా ఈ ఖగోళ వింతను చూడడం మరిచిపోవద్దు.

## సైఫ్ అలీఖాన్ ఆరోగ్య బీమా పత్రం లీక్.. ఎంత క్లెయిమ్ చేశారు, ఏరోజు డిశ్చార్జ్ కాబోతున్నారంటే?



**ముంబై-నవభూమి:** బాలీవుడ్ స్టార్ హీరో సైఫ్ అలీఖాన్‌పై గురువారం రోజు ఉదయం దాడి జరిగిన విషయం అందరికీ తెలిసిందే. అయితే తీవ్ర గాయాలతో లీలావతి ఆస్పత్రిలో చేరిన ఆయన ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం బాగానే ఉన్నట్లు తెలుస్తోంది. అయితే తాజాగా ఈయనకు సంబంధించిన ఆరోగ్య బీమా పత్రం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అందులో ఆయన ఎంత క్లెయిమ్ చేశారు, ఎంత అప్రూవ్ అయిందో కూడా కనిపిస్తోంది. అలాగే సైఫ్ డిశ్చార్జ్ తేదీని కూడా అందులో వెల్లడించారు. ఆ పూర్తి వివరాలు ఏంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం. బాలీవుడ్ స్టార్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై గురువారం రోజు దాడి జరిగిన విషయం అందరికీ తెలిసిందే. ఓ ఆగంతకుడు ఇంట్లోకి చొరబడి కోటి రూపాయలు డిమాండ్ చేస్తూ.. సైఫ్‌పై ఆరు సార్లు కత్తితో దాడి చేశాడు. అయితే తీవ్ర గాయాలపాలైన అతడిని కుటుంబ సభ్యులు ఓ ఆటోలో ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలోనే లీలావతి ఆస్పత్రి వైద్యులు అతడికి శస్త్ర చికిత్స చేసి వెన్నుపూసకు దగ్గర్లో ఇరుక్కుపోయిన కత్తి ముక్కను తొలగించారు. అలాగే రెండు చోట్ల ప్లాస్టిక్ సర్జరీ కూడా నిర్వహించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. అయితే తాజాగా సైఫ్‌కు సంబంధించిన ఆరోగ్య బీమా పథకం డాక్యుమెంట్ నెట్టింట వైరల్ అవుతోంది. ఆ పూర్తి వివరాలు ఏంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం.శుక్రవారం రోజు సైఫ్ అలీఖాన్‌కు సంబంధించిన ఆరోగ్య బీమా పథకం ఎక్స్ వేదికగా లీకైంది. దీన్ని చూసిన నెటిజెన్లు పెద్ద ఎత్తున షేర్ చేయగా.. హీరో హెల్త్ ఇన్సూరెన్స్ డాక్యుమెంట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ డాక్యుమెంట్ ప్రకారమే.. సైఫ్ అలీఖాన్ నివా బుపా ఆరోగ్య బీమా పాలసీదారుగా తెలుస్తోంది. అయితే ఆయన తన చికిత్స కోసం రూ.35,98,700 లక్షలు క్లెయిమ్ చేయగా.. బీమా సంస్థ ఇప్పటికే రూ.25 లక్షలను అప్రూవ్ చేసింది. ముఖ్యంగా ఇందులో మెంబర్ ఐడీ, రోగ నిర్ధారణ వివరాలు, గది వర్గం సహా అనేక వివరాలు ఉన్నాయి.

ముఖ్యంగా సైఫ్ 16వ తేదీన ఆస్పత్రిలో అడ్మిట్ అయినట్లు ఉండగా.. అలాగే ఏరోజు ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ కాబోతున్నారో కూడా ఉంది. జనవరి 21వ తేదీ రోజు అంటే మరో మూడు రోజుల్లోనే ఆయన డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉన్నట్లు అందులో తెలిపారు. మొత్తం 5 రోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు వివరించారు. అయితే నెట్టింట వైరల్ అవుతున్న ఈ బీమా డాక్యుమెంట్ చూసిన ప్రతీ ఒక్కరూ ఒక్కో విధంగా స్పందిస్తున్నారు. సెలబ్రిటీ కాబట్టి ఇంత త్వరగా డబ్బులు అప్రూవ్ చేశారని కొందరు.. అసలు ఇలాంటి విషయాలు ఎలా లీక్ చేయగల్గుతారంటూ మరికొంత మంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే దీనిపై సైఫ్ కుటుంబ సభ్యులు అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు.

## మెట్రో ప్రయాణికులకు బ్యాడ్‌న్యూస్.. ఈనెల 20 నుంచి ఛార్జీలు పెంపు

**బెంగళూరు-నవభూమి:** ప్రయాణికులకు బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ బిగ్ షాక్ ఇచ్చింది. మెట్రో ఛార్జీల పెంపునకు ఆమోదముద్ర వేసింది. ఈనెల 20వ తేదీ నుంచి బెంగళూరు మెట్రో రైల్ ఛార్జీలు పెరగనున్నాయి. అయితే ఏ మేరకు పెంచుతారు అనేది మాత్రం ఇంకా క్లారిటీ రాలేదు. త్వరలోనే పెంచిన ఛార్జీలకు చెందిన సమాచారాన్ని వెల్లడిస్తామని బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు వెల్లడించారు. ఇక మెట్రో ఛార్జీల పెంపుపై స్థానిక ఎంపీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.


కర్ణాటకలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వల్ల ఆర్టీసీకి వచ్చే నష్టాలను పూడ్చుకోవడంలో భాగంగా ఇటీవలె సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. బస్ ఛార్జీలను పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. అయితే బెంగళూరు నగరంలో నడిచే మెట్రో రైలు ఛార్జీలు కూడా తాజాగా పెరిగాయి. మెట్రో ఛార్జీలు పెంచుతూ



తాజాగా బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ శుక్రవారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పెరిగిన ఛార్జీలు జనవరి 20వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని.. మెట్రో రైల్ కార్పొరేషన్ వర్గాలు వెల్లడించాయి. అయితే పెంచిన ఛార్జీల వివరాలు మాత్రం ఇంకా అధికారికంగా విడుదల చేయలేదు.అయితే.. బెంగళూరు నగరంలో మెట్రో రైల్ ఛార్జీలను సవరించాలన్న ఫేర్ ఫిక్సేషన్ కమిటీ -ఎఫ్ఎఫ్‌సీ సిఫారసుకు మాత్రం బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ బోర్డు ఆమోద ముద్ర వేసింది. త్వరలోనే సవరించిన ఛార్జీలకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రకటిస్తామని బీఎమ్ఆర్‌సీఎల్ సీనియర్ అధికారి ఒకరు స్పష్టం చేశారు. అయితే ప్రస్తుతం బెంగళూరు మెట్రోలో కనీస ఛార్జీ రూ.10 గా ఉంది. గరిష్ఠంగా రూ.60 మెట్రో టికెట్ ఉంది. మరోవైపు.. స్మార్ట్‌కార్డు కలిగి ఉన్న ప్రయాణికులకు ఈ టికెట్ ఛార్జీపై 5 శాతం తగ్గింపు ఉంటుంది.

ఈ నేపథ్యంలోనే కొత్తగా పెంచిన ఛార్జీలు 40 నుంచి 45 శాతం వరకు ఉంటాయని అంచనా వేస్తున్నారు. కనీస ఛార్జీని రూ.15 గా నిర్ణయించాలని మెట్రో రైల్ కార్పొరేషన్ సమావేశంలో చర్చ జరిగినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇక గరిష్టంగా ఇప్పటివరకు ఉన్న రూ.60 ఛార్జీ కాస్త రూ.80కి పెరగనున్నట్లు సమాచారం. అయితే బీఎమ్ఆర్‌సీఎల్ మాత్రం ఇంకా అధికారికంగా ఛార్జీలు ఎంత పెరుగుతాయి అనేది వెల్లడించలేదు.

## ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్



**న్యూఢిల్లీ-నవభూమి:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జనవరి 31 నుంచి ఏప్రిల్ 4 వరకు రెండు విడతల్లో జరగనున్నాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఆమె బడ్జెట్‌ను సమర్పించడం ఇది వరుసగా ఎనిమిదోసారి. సంప్రదాయం ప్రకారం జనవరి 31న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం ప్రభుత్వం ఆర్థిక సర్వేను సభలో ప్రవేశపెడుతుంది. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్‌ను నిర్మలా సీతారామన్ ప్రవేశపెడతారు. బడ్జెట్ తర్వాత ఉభయ సభల్లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. ఈ తీర్మానంపై ప్రధాని సమాధానంతో మొదటి విడత బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 13న ముగియనున్నాయి. మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకు రెండో విడత బడ్జెట్ సమావేశాలు జరుగనున్నాయి.

# నెయ్యితో నిగారింపు!



నెయ్యిని కొందరు ఇష్టంగా తింటారు. కొందరు మాత్రం అసలు ఇష్టపడరు. అయితే నెయ్యితో కలిగే బ్యూటీ బెనిఫిట్స్ గురించి తెలిస్తే మీ అభిప్రాయాన్ని మార్చుకుంటారు. అవేమిటంటే..పొడి చర్మం చాలా మందిని ఇబ్బంది పెడుతుంది. సీజన్‌తో సంబంధం లేకుండా డ్రై స్కిన్‌తో సమస్యలు ఎదుర్కొంటూ ఉంటారు. అటువంటి వాళ్లు కొన్ని చుక్కల నెయ్యిని చర్మంపై రాసుకుని కాసేపు సాజ్ చేసి వదిలేయాలి. ఇలా రోజూ చేయడం వల్ల పొడి చర్మం సమస్య దూరమవుతుంది. చర్మం మృదువుగా తయారవుతుంది.

నెయ్యిని ఆహారంతోపాటు తీసుకుంటే చర్మం యవ్వనంగా కనిపించ డానికి సహాయపడు తుంది. నెయ్యిలో ఉండే విటమిన్-ఇ వయసు పైబడిన లక్షణాలను దరిచేర కుండా చూస్తుంది. అంతేకా దు చర్మం ముడతలు పడకుండా ఉండడం లోనూ నెయ్యి తోడ్పడు తుంది. బాత్ ఆయిల్‌గానూ నెయ్యిని ఉపయోగించవచ్చు.

5 టేబుల్‌స్పూన్ల నెయ్యి తీసుకుని అందులో పది చుక్కలు మీకిష్టమైన ఎసెన్షియల్ ఆయిల్ వేసి కలుపుకోవాలి. ఈ మిశ్రమం కొన్ని చుక్కలు స్నానం చేసిన తరువాత ఒంటికి రాసుకుంటే చర్మం మృదువుగా తయారవుతుంది. కళ్లు అలసటగా ఉంటే కొన్ని చుక్కల నెయ్యిని కళ్ల చుట్టూ రాసుకుని నెమ్మదిగా మసాజ్ చేస్తే ఉపశమనం లభిస్తుంది. నెయ్యిని పెదాలకు రాసుకుంటే మృదువుగా తయారవుతాయి.

# ఆమ్ కీ ఖీర్



**కావల్సినవి:** బాస్మతీ బియ్యం - కప్పు (గంట ముందు నానబెట్టుకోవాలి), చక్కెర - ఒకటిన్నర కప్పు, పాలు - రెండులీటర్లు, మామిడిపండ్లు పెద్దవి - నాలుగు, గులాబీనీరు - రెండు చుక్కలు, బాదం, పిస్తా పలుకులు - రెండూ కలిపి పావుకప్పు, కోవా - అరకప్పు.

**తయారీ:** మామిడిపండ్ల చెక్కు తీసి ముక్కల్లా కోసి పెట్టుకోవాలి. అలాగే నానిన బియ్యాన్ని మిక్సీ జారులోకి తీసుకుని మెత్తని పిండిలా చేసుకుని పెట్టుకోవాలి. ఇప్పుడు పాలను వేడిచేసి అందులో బియ్యప్పిండి వేసి మంట తగ్గించాలి. కాసేపటికి అది ఉడుకుతుంది. అప్పుడు చక్కెరా, కోవా వేసి బాగా కలపాలి. ఇది చిక్కగా అయ్యాక మందుగా కోసి పెట్టుకున్న మామిడిపండు ముక్కలూ, గులాబీనీరూ వేసి కలిపి రెండు నిమిషాలయ్యాక దింపేయాలి. చివరగా బాదం, పిస్తా పలుకులు వేసి వేడి చల్లారాక ఫ్రిజ్‌లో పెట్టాలి. ఇది చల్లగా తీసుకుంటేనే బాగుంటుంది.

## యాపిల్ మిల్క్‌షేక్




**కావల్సినవి:** యాపిల్ ముక్కలు - పెద్ద కప్పు, గింజల్లేని ఖర్జూరాలు - మూడు (సన్నగా తరగాలి), తేనె - పావుకప్పు, చల్లటి పాలు - ఒకటిన్నర కప్పు.

తయారీ: యాపిల్, ఖర్జూర ముక్కలు, పెద్ద చెంచా తేనె, అరకప్పు పాలు తీసుకుని మిక్సీలో మెత్తగా చేసుకోవాలి. యాపిల్ ముక్కలు ముద్దగా అయ్యాక మిగిలిన పాలూ, తేనె వేసి మరోసారి మిక్సీ పట్టాలి. చివరగా గ్లాసుల్లోకి తీసుకుని నాలుగు ఐసుముక్కలు వేసుకుంటే చాలు. చల్లచల్లటి యాపిల్ మిల్క్‌షేక్ తయారైనట్లే.

# బార్లీ గొప్ప చెప్పతరమా!

*రూక్షశీతో గురుః స్వాదుస్సరో విద్వాత కృద్యవః*
*వృష్య స్స్థైర్య కరోమూత్రమేదః పిత్తకఫాన్ జయేత్*
*పీనస శ్వాసకాసోరు స్తంభ కంఠత్వగామయాన్!*

బార్లీ అంటే జ్వరాలు వచ్చినప్పుడు జావ కాచుకుని తాగేందుకు మాత్రమే వాడతారనే ఓ బలమైన అభిప్రాయం ఉంది. కానీ వరి కన్నా, గోధుమకన్నా బార్లీ అనేక రెట్లు ఆరోగ్యదాయకమైన, బలకరమైన, ప్రయోజనకరమైన ధాన్యం అని చాలా మందికి తెలీదు. ఆ మాటకొస్తే అన్ని ధాన్యాలకన్నా బార్లీయే ఎక్కువ శక్తిదాయకం కూడా! ఋగ్వేద కాలం నాటి ప్రజలకు బార్లీ ప్రధాన ఆహార ధాన్యం. వాళ్లు దానిని 'యవలు' అని పిలిచేవారు. ఈ పేరు రావటానికి కూడా ఒక కారణముంది. ఋగ్వేద కాలంలో అంగుళంలో ఆరో వంతు ప్రమాణాన్ని 'యవ' అనేవారు. బార్లీ అంగుళంలో ఆరోవంతు ఉంటుంది కాబట్టి దీనిని 'యవ' అన్నారు. ఇదే విధంగా వేలిముద్రల్ని జాగ్రత్తగా పరిశీలిస్తే కొన్ని వేళ్ల మీద గీతలు యవ కంకుల్లా కనిపిస్తాయి. అందుకే వేళ్ల మీద గీతల్ని యవ అంటారు. జ్యోతిష శాస్త్రంలో కూడా యావ అనేది ఒక యోగం. ఇక దీనికి శూకముండాఖ అనే పేరు కూడా ఉందని 'భోజన కుతూహలం' గ్రంథం పేర్కొంది.



నేక గుణాలు...

బార్లీ గింజలకు 'లేఖనం' అనే గుణం ఉంది. అంటే జిడ్డుని తొలగింస్తుందన్న మాట. శరీరంలో జిడ్డుని కలిగించేది కొవ్వు. ఆ కొవ్వుని తగ్గించే శక్తి బార్లీకుంది. అందువ్ల స్థూలకాయులకు ఇది దివ్యౌషధమని ఆయుర్వేదం పేర్కొంటుంది. అంతే కాదు... మిగతా ధాన్యాలకన్నా ఆహార పీచు (డయటరీ ఫైబర్) బార్లీలో ఎక్కువ. 'గురు' అనే గుణం కలిగి ఉండటం చేత బార్లీ ఆలస్యంగా జీర్ణం అవుతుంది. అందుకని షుగరు రక్తంలో చేరకుండా, షుగరు సూచిక వెంటనే పెరగకుండా ఆపుతుంది. బార్లీ గింజలకు కడుపులో, మూత్రంలో, విరేచనంలో మంటను తగ్గించే గుణం ఉంది. మూత్రాశయంలో కలిగే ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తుంది కూడా. ఊపిరితిత్తుల్లో పేరిన కఫాన్ని తగ్గిస్తుంది. తేలికగా జీర్ణం అవుతుంది. గొంతులో వచ్చే వ్యాధుల్లో బార్లీ ఔషధంగా ఉపయోగపడ్తుంది. దీర్ఘకాలం వదలని పడిశ భారాన్ని తగ్గిస్తుంది. దగ్గుని, ఆయాసాన్ని, ఉబ్బసాన్ని నివారిస్తుంది. కండరాలు పట్టేయటాన్ని ఆపుతుంది. రక్త దోషాల్ని, దప్పికని తగ్గిస్తుంది. వడ దెబ్బ తగలకుండా ఆపుతుంది. గడ్డల్ని కరిగించే ఫెరూలిక్ యాసిడ్ అనే రసాయనం ఇందులో ఉంటుంది. ఇది ట్యూమర్లను, కేన్సర్ గడ్డల్ని కరిగిస్తుంది. కేన్సన్ ముదరకుండా సాయపడుతుంది.



**బార్లీ నీళ్లే కాదు...**

బార్లీ గింజల్లో నీళ్లు పోసి, మెత్తగా ఉడికించి, వార్చిన జావ తాగుతుంటారు. కానీ, గింజల్ని వదిలేస్తుంటారు. ఇది సరికాదు. నీటిలో కరిగే స్వభావం ఉన్న పోషకాలు మాత్రమే ఈ జావలోకి వస్తాయి. మిగిలిన మినరల్స్, ఫైబరు వగైరా ఆ గింజల్లోనే ఉండిపోతాయి. అందుకని గింజలతో సహా జావ తాగాలి. బార్లీ, గోధుమ పిండిని చెరిసగం కలిపి తయారు చేసిన చపాతీలు, పుల్కాలు ఎంతో మృదువుగానూ, ఆరోగ్యదాయకంగానూ ఉంటాయి. దోశలు ఇతర పిండివంటల్లో కూడా బార్లీని కలుపుకోవచ్చు. కొందరు బార్లీని దోరగా వేగించి మెత్తగా మిక్సీ పట్టిన పిండిని కూరల్లోనూ పులుసుల్లోనూ చిక్కదనం కోసం వాడుతుంటారు. ఈ పిండిని నీళ్లలో వేసి ఉడికించగా వచ్చిన చిక్కని గంజిలో ఉప్పు గానీ తీపి గానీ నిమ్మరసం గానీ కలుపుకుని తాగుతారు. సమానంగా పెరుగు కలిపి మిక్సీ పట్టిన బార్లీ మజ్జిగవల్ల ప్రోబయాటిక్ ప్రయోజనాలు కూడా అదనంగా అందుతాయి. బి- విటమిన్ లోపంతో బాధపడేవారికి రోజూ రెండు చెంచాల బార్లీ పిండిని జావకాచి ఇస్తుంటే విటమిన్ మాత్రల అవసరం ఉండదు. మూత్రపిండాలలో రాళ్లు కరిగించే గుణం దీనికి ఉంది. విరేచనం ఫ్రీగా అవుతుంది. ఎక్కువగా న డ వ టం ద్వారా నీరు పట్టటం తగ్గుతుంది. చర్మానికి మంచి రంగుని, మృదుత్వాన్ని ఇస్తుంది. బీపీ త్వరగా తగ్గేందుకు తోడ్పడుతుంది. అతిసారం, కలరా లాంటి వ్యాధుల్లో చిక్కని బార్లీ జావని పెరుగు కలిపి, చిలికి, ఉప్పు, పంచదార వేసి తాగితే విరోచనాలు తగ్గుతాయి.

# లవంగం తింటే లాభాలు



మన దేశంలోనే కాదు అనేక దేశాల్లోనూ లవంగాలను మసాలా దినుసుగా వాడుతారు. వీటిని వంటల్లో వేస్తే వంటలకు చక్కని రుచి, వాసన వస్తాయి. ఇక లవంగాలు వేయకుండా నాన్ వెజ్ వంటలను వండరు. ఇవి అంతలా ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. అయితే కేవలం వంటలకే కాక ఇవి మనకు పలు ఆరోగ్యకర ప్రయోజనాలను ఇచ్చే అద్భుతమైన ఔషధంగా కూడా పనిచేస్తాయి. ఈ క్రమంలోనే రోజూ 3 పూటలా భోజనం తరువాత ఒక లవంగాన్ని నమిలి తింటే ఎలాంటి లాభాలు కలుగుతాయో ఇప్పుడు తెలుసుకుందాం.

1. లవంగాలను తినడం వల్ల జీర్ణవ్యవస్థ సరిగ్గా పనిచేస్తుంది. జీర్ణాశయం, పేగులు శుభ్రమవుతాయి. గ్యాస్, అసిడిటీ, వికారం, అజీర్ణం తగ్గిపోతాయి. మలబద్ధకం పోతుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది.
2. లవంగాల్లో యాంటీ బాక్టీరియల్ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి అనేక రకాల సూక్ష్మ క్రిముల నుంచి, ఇన్‌ఫెక్షన్ల నుంచి మనల్ని రక్షిస్తాయి. శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. ఫ్లూ, దగ్గు, జలుబు, జ్వరం వంటి వ్యాధులను నయం చేస్తాయి.
3. ఊపిరితిత్తుల క్యాన్సర్ మొదటి దశలో ఉంటే అలాంటి వారు లవంగాలను రోజూ తింటే క్యాన్సర్ బారి నుంచి తప్పించుకోవచ్చని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. లవంగాల్లో ఉండే యాంటీ కార్సినోజెనిక్ గుణాలు క్యాన్సర్ కణాలతో పోరాడి వాటిని నాశనం చేస్తాయి.
4. లవంగాలను రోజూ తినడం వల్ల వాటిల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు లివర్‌ను శుద్ధి చేస్తాయి. మెటబాలిజంను మెరుగు పరుస్తాయి. దీంతో కొవ్వు కరుగుతుంది. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పోయి మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. గుండె జబ్బులు రాకుండా ఉంటాయి.
5. డయాబెటిస్ సమస్యతో బాధపడుతున్నవారు నిత్యం తమ ఆహారంలో లవంగాలను చేర్చుకుంటే దాంతో అద్భుతమైన ఫలితం ఉంటుందని సాక్షాత్తూ వైద్యులే చెబుతున్నారు. లవంగాల్లో ఉండే ఇన్సులిన్ వంటి గుణాలు రక్తంలో ఉండే గ్లూకోజ్ స్థాయిలను క్రమబద్ధీకరిస్తాయి. దీంతో డయాబెటిస్ అదుపులో ఉంటుంది.
6. లవంగాల్లో యుజెనాల్, ఫ్లేవోన్స్, ఐసో ఫ్లేవోన్స్, ఫ్లేవనాయిడ్స్ అని పిలవబడే ఫీనోలిక్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి ఎముకలను రక్షిస్తాయి. దీంతో వయస్సు మీద పడడకం కారణంగా వచ్చే ఆస్టియో పోరోసిస్ (ఎముకలు గుల్లబారిపోవడం)ను తగ్గిస్తాయి.
7. లవంగాల్లో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు కూడా పుష్కలంగానే ఉంటాయి. ఇవి నొప్పులు, వాపులను తగ్గిస్తాయి. శరీరంలో నీరు ఎక్కువగా చేరకుండా చూస్తాయి.
8. లవంగాలను తినడం వల్ల దంతాలు, చిగుళ్ల సమస్యలు పోతాయి. దంతాలు ద ృఢంగా మారుతాయి. నోటి దుర్వాసన పోతుంది.
9. లవంగాలను తినడం వల్ల తలనొప్పి తగ్గుతుంది. పాలలో చిటికెడు లవంగాల పొడిని కలుపుకుని తాగితే తలనొప్పి ఇట్టే తగ్గిపోతుంది.

# బాదాం ఎలా తింటే మంచిది?

## పోషకాలు పుష్కలంగా లభించాలంటే?



ఈ మధ్యకాలంలో తృణ ధాన్యాలు, నట్స్ , డ్రైఫ్రూట్స్ వినియోగం బాగా పెరిగింది. ఒకపుడు ఖరీదైనవి మనకెందుకులే అని వదిలేసిన సామాన్యులు కూడా వాటిపై అవగాహన పెంచుకుంటున్నారు. పోషకాహారం లేక వ్యాధుల బారినపడే కంటే ముందే జాగ్రత్త పడాలని భావిస్తున్నారు. అలాంటి వాటిలో ఒకటి బాదాం. మరి బాదం పప్పులను ఎలా తీసుకుంటే మంచిది? నానబెట్టి తినడం వల్లే అదనపు ప్రయోజనాలుంటాయా? ఆల్మండ్‌లోని పోషకవిలువలు, ఆరోగ్యకర ప్రయోజనాలు తెలియాలనుకుంటున్నారా? అయితే ఈ వీడియో మీకోసం.. అద్భుతమైన పోషక విలువలు, ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్లు, ఖనిజాలతో సమృద్ధిగా ఉన్న పప్పు బాదం. బాదం ఒమేగా 3, విటమిన్ ఇ, ప్రొటీన్, పీచుతో నిండి ఉంటుంది. బరువు తగ్గడం నించీ రక్తపోటు అదుపులో ఉంచుకోడం వరకూ, గుండె ఆరోగ్యాన్ని కాపాడడం నించీ కాన్సర్ ముప్పుని తగ్గించడం వరకూ బాదం చేసే మేలు అంతా ఇంతా కాదు. అందుకే సూపర్ ఫుడ్ అని కూడా భావిస్తున్నారు. ఇందులో ఉన్న ప్రొటీన్ ఆకలిని నియంత్రిస్తుంది. దీంతో బరువు తగ్గడం కూడా తేలిక. మెగ్నీషియం వల్ల ఎముకలు బలపడతాయి, ఇంకా మధుమేహం కూడా అదుపులో ఉంటుంది. అంతేకాదు, రక్తపోటు ఉన్నవారికి ఇది చాలా మేలు చేస్తుంది. నానబెట్టిన బాదాం తింటేనే ఎక్కువ ప్రయోజనాలా అంటే మాత్రం అవుననే చెప్పాలి. (మీ గార్డెన్‌లో గులాబీలు విరగ బూయాలంటే?)ఏదైనా గింజని నానబెట్టి, మొలక వచ్చేలా చేసినపుడు వాటిల్లో కొవ్వు ప్రొటీన్‌గా మారుతుంది. అలాగే బాదం పప్పులు మీద ఉండే తొక్కలో టానిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది పోషకాలను గ్రహించకుండా చేస్తుంది. నాన బెట్టి, పైన తోలు తీసి తినడం వల్ల మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయి. రాత్రి నానబెట్టిన అయిదు లేదా ఆరు బాదం పప్పులను ఉదయాన్నే తింటే మంచిదని ఆహార నిపుణులు చెబుతున్నారు. నానబెట్టిన బాదంలో ఉండే విటమిన్ కాన్సర్ ముప్పును తగ్గిస్తుంది. నానబెట్టిన బాదంపప్పులో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. అలాగే నానబెట్టిన బాదంనించి లిపేజ్ అనే ఒక ఎంజైమ్ విడుదల అవుతుంది. ఇది అరుగుదలకీ, అనవసరమైన కొవ్వు కరగడానికీ ఉపయోగపడుతుంది. దీంతోపాటు గర్భిణీ స్త్రీలకు అవసరమైన ఫోలిక్ యాసిడ్ నానబెట్టిన బాదంలో సమృద్ధిగా ఉంది. చెడు కొలెస్ట్రాల్‌కి చెక్ చెప్పే బాదం గుండె ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. బాదంలో యాంటీ ఆక్సిడెంట్స్ సమృద్ధిగా ఉంటాయి. వీటిలో ఉండే విటమిన్ ఇ యాంటీ ఆక్సిడెంట్ గా పనిచేసి ఫ్రీ రాడికల్స్ వల్ల జరిగే నష్టాన్ని తగ్గించి వయసు కనపడనివ్వకుండా చేస్తుంది.

బాదం పప్పులు పోషకాలలోనే కాదు, వంటకాలలో వాడుకోడానికి కూడా పనికొస్తాయి. బాదం ఒమేగా 3, విటమిన్ ఇ లాంటి పోషకాలతో సమృద్ధమైంది. బాదం తిన్నాక నిండుగా అనిపించి తొందరగా ఆకలి వేయదు. పాయసం మీద సన్నని పలుకులుగా చేసి చల్లినా, నూరి కుర్మా లో వాడినా, నానబెట్టి రుబ్బి బాదం పాలు తయారుచేసినా అందరూ ఇష్టపడతారు. బాదంలో అద్భుతమైన పోషక గుణాలు ఉన్నాయి. ఈ లాభాలన్నిటినీ పొందాలంటే వాటిని రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం అవసరం. ఇలా చేయడం వల్ల ఆరోగ్యకరమైన జీవితం మన సొంతం అవుతుందని డైటీషియన్స్ చెబుతున్నారు. బాదం టీ ప్రయోజనాలు

బాదం పప్పులు అధిక పోషకాహారాన్ని అందిస్తాయి. వీటిలో యాంటీఆక్సిడెంట్లు, ఉంటాయి. బాదంలో ప్రోటీన్, ఫైబర్, విటమిన్ ఇ, కాల్షియం, జింక్ వంటి పోషకాలు ఉంటాయి. ఇవి మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇది కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిని సరిగ్గా ఉంచుతుంది. ఉన్నవారికి ఇది ఉపయోగకరంగా ఉంటుంది. మెగ్నీషియం సరైన మొత్తంలో తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ తగ్గుతుంది. ఇది గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. బాదంపప్పును అనేక రకాలుగా తినవచ్చు. బాదం టీని కూడా తయారు చేసుకోవచ్చు. ఇది రుచికరమైనది మాత్రమే కాదు చాలా ఆరోగ్యకరమైనది కూడా.




## ఐదేండ్లలో భారత ఆటోమొబైల్ ఇండస్ట్రీ నంబర్ వన్.. తేల్చేసిన కేంద్రమంత్రి గడ్కరీ..!



**న్యూఢిల్లీ-నవభూమి:**వచ్చే ఐదేండ్లలో భారత్ ఆటోమొబైల్ పరిశ్రమ ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలుస్తుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. ఇప్పటి వరకూ దేశీయ ఆటోమొబైల్ రంగం 4.5 కోట్ల ఉద్యోగాలు కల్పించిందన్నారు. ఆటోమొబైల్ డీలర్ సంఘాల సమాఖ్య (ఫాడా) ఆధ్వర్యంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారత ఆటోమొబైల్ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా చాలా ఎక్కువ డిమాండ్ ఉందన్నారు. 'భారత ఆటోమొబైల్ రంగ పరిశ్రమ ప్రస్తుతం రూ.22 లక్షల కోట్లకు చేరుకుంది. వచ్చే ఐదేండ్లలో ప్రపంచంలోనే నంబర్‌వన్‌గా నిలుస్తుందని నేను విశ్వాసంతో ఉన్నాను' అని చెప్పారు. ప్రస్తుతం అమెరికా ఆటోమొబైల్ పరిశ్రమ రూ.78 లక్షల కోట్లు, చైనా ఆటోమొబైల్ రంగం రూ.47 లక్షల కోట్లు, భారత్ ఆటోమొబైల్ ఇండస్ట్రీ రూ.22 లక్షల కోట్ల విలువ కలిగి ఉంది. 2014లో కేంద్ర రవాణాశాఖ మంత్రిగా తాను బాధ్యతలు స్వీకరించినప్పుడు భారత ఆటోమొబైల్ పరిశ్రమ పరిమాణం రూ.7.5లక్షల కోట్లు ఉంటే, ఇప్పుడు రూ.22 లక్షల కోట్లకు పెరిగిందని నితిన్ గడ్కరీ తెలిపారు. ఆటోమొబైల్ రంగం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జీఎస్టీ రూపంలో అధిక ఆదాయం లభిస్తుందన్నారు. దేశంలో తయారవుతున్న ద్విచక్ర వాహనాల్లో సగం విదేశాలకు ఎగుమతి అవుతున్నాయన్నారు.

## 'నామినీలు తప్పనిసరి'



**ముంబై-నవభూమి:** బ్యాంక్ ఖాతాలతోపాటు డిపాజిట్ ఖాతాలు, లాకర్లు ఇక నుంచి కచ్చితంగా నామినీలు తప్పనిసరి చేయాలని బ్యాంకులకు రిజర్వు బ్యాంక్ తాజాగా ఆదేశించింది. దేశవ్యాప్తంగా అత్యధిక స్థాయిలో బ్యాంక్ ఖాతాలకు నామినీలు లేరని, వెంటనే పాత, కొత్త ఖాతాలకు కచ్చితంగా నామినీ ఉండాల్సిందేనని శుక్రవారం ఆదేశించింది. డిపాజిటర్ మరణించిన వారి కుటుంబీలకు ఆయా డిపాజిట్లను సమర్పించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఈ సమస్య రాకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది.ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో చాలా డిపాజిట్ ఖాతాలకు నామినీలు లేరని సెంట్రల్ బ్యాంక్ గుర్తించింది. మరోవైపు, బ్యాంక్ ఖాతాకు సంబంధించి లావాదేవీలకోసం '1600ఎక్స్‌ఎక్స్' ఫోన్ నంబర్‌ను వినియోగించుకోవాలని బ్యాంకులకు సెంట్రల్ బ్యాంక్ సూచించింది. ఆర్థిక మోసాలను నియంత్రించడానికి ఈ సరికొత్త నంబర్‌ను ప్రవేశపెట్టింది ఆర్బీఐ. అలాగే ప్రమోషనల్ కోసం బ్యాంకులు, ఇతర రెగ్యులేటెడ్ సంస్థలు 140ఎక్స్‌ఎక్స్ నంబర్‌ను వినియోగించుకోవాలని సూచించింది.

## 'ట్రంప్ మీమ్ కాయిన్..' ఇదో గిమ్మిక్కా..? క్రిప్టో మాయనా?

**న్యూయార్కు-నవభూమి:**మరొక్క రెండు రోజుల్లో అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్న డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే అనేక సంచనాలు రేపారు. అసలు ట్రంప్ అంటేనే సంచలనం.. ఇక ఆయన బాధ్యతల్లోకి రాకముందే పనామా కాల్వ, గ్రీన్ ల్యాండ్ అంశాలను టచ్ చేశారు. ఇప్పుడు మరొక కొత్త సంచలనం. అదే 'ట్రంప్ మీమ్ కాయిన్'. ఇది క్రిప్టో బంగారామా? లేక గిమ్మిక్కా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అది కూడా అతి కొద్ది వ్యవధిలో బాధ్యతలు స్వీకరించనుండగా ఇలా చేయడంపై అనుమానాలు వస్తున్నాయి.

ఇక ట్రంప్ విడుదల చేస్తే చెప్పేదేముంది..? ఆయన కొత్త మీమ్ కాయిన్ మార్కెట్ క్యాప్ మూడు గంటల్లోనే 8 అమెరికన్ బిలియన్లకు చేరింది. వాస్తవానికి ఇలాంటివాటికి చట్టబద్ధత ఉంటుందా? అంటే చెప్పలేం. ఇక్కడ గమనించాల్సింది నాణెం విలువనే. అంతేగాక.. క్రిప్టో సమాజం నుంచి దీనిపై విపరీతమైన ఆసక్తి వ్యక్తమైంది. అదే సమయంలో సందేహాలూ రేకెత్తాయి.అధ్యక్షుడి సీట్లో కొద్ది కాలం ముందు ట్రంప్ పేరిట కొత్త క్రిప్టో టోకెన్ విడుదల చేయడం ఆలస్యం.. అదొక పోటీ కరెన్సీలాగా దూసుకెళ్లడం విశేషం. సహజంగానే ట్రంప్ సొంత సోషల్ మీడియా ట్రూత్ తో పాటు ఎక్స్ లోనూ సంచలనంగా మారింది.అనూహ్యంగా చోటుచేసుకున్న పరిణామాలతో నెటిజన్లు కూడా కొంత సంశయానికి గురయ్యారు. ట్రంప్ సోషల్ మీడియా హ్యాక్ అయిందా.? అని కూడా ఆశ్చర్యపోయారు, ప్రత్యేకించి ట్రూత్ సోషల్ ఖాతాలో పెగ్గి ష్విన్ ను డిప్యూటీ సెక్రటరీ ఆఫ్ ఎడ్యుకేషన్ పేరు తప్పుగా ఉండడంతో అనుమానాలు బలపడ్డాయి.ఇక మార్కెట్ క్యాప్ మూడు గంటల్లోనే %$%8 బిలియన్లకు పెరిగింది. ట్రేడింగ్ వాల్యూమ్‌లు $1 బిలియన్ కు చేరుకున్నాయి. నాణెం విలువ నిమిషాల్లో 300 శాతం పైగా పెరిగింది. చివరకు $TRUMP ధర ప్రారంభ $ 0.18 నుంచి $ 7.1కి స్థిరపడింది. పెరుగుదలతో ఓ వ్యాపారి గంటలో $ 20 మిలియన్ల లాభం ఆర్జించారు. 2024 జూలైలో ట్రంప్ ఎన్నికల ప్రచారంలో ఉండగా ఆయనపై కాల్పులు జరిగిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో తూటా ట్రంప్ కుడి చెవి మీదుగా దూసుకెళ్లింది. ఇది పెన్సిల్వేనియాలో జరిగింది. ఆ హత్యాయత్నం నుంచి బయటపడిన తర్వాత ట్రంప్ "ఫైట్, ఫైట్, ఫైట్" అంటూ నినదించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మీమ్ కాయిన్ ఆ నాటి ఫోటోతోనే విడుదలవడం గమనార్హం.

టోకెన్ క్రిప్టో ప్రపంచంలో చర్చనీయంగా మారినప్పటికీ, దాని నిజమైన విలువ- భవిష్యత్తు ఇంకా అనిశ్చితమే. కేవలం ఇది మీమ్ కాయిన్ రంగంలో ఓ అనూహ్య ప్రయాణంగా మిగిలిపోతుందా? లేక డిజిటల్ ఆస్తుల్లో పెద్ద సంచలనంగా మారుతుందా? వేచి చూడాలి. మొత్తానికి ట్రంప్ బ్రాండ్ రాజకీయాలు, వాణిజ్య వస్తువులు లేదా క్రిప్టో కరెన్సీ ప్రపంచంలో ఆసక్తికరంగానే ఉన్నాయి.

## నా జీతం రూ. 29,500, రూ. 9.4 లక్షల లోన్.. సిప్ ఎలా ప్లాన్ చేయాలి..



**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రస్తుత కాలంలో పెట్టుబడులు రుణాల నిర్వహణ ఆర్థిక స్థితిని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఎలాగంటే మీ జీతం రూ. 29,500 ఉండి, మీరు 10% వడ్డీతో రూ. 9.4 లక్షల ఓవర్‌డ్రాఫ్ట్ లోన్ కల్గి ఉన్నప్పటికీ, మీరు (సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్) ద్వారా పెట్టుబడులు చేయవచ్చు. అయితే అది ఎలా అనేది ఇక్కడ తెలుసుకుందాం.మీకు ఉన్న లోన్ 10% వడ్డీ రేటుతో ఉండటం వల్ల, అది మీరు చేసే పెట్టుబడులకు మించి భారాన్ని ఉంచవచ్చు. కాబట్టి ద్వారా పెట్టుబడులు ప్రారంభించే ముందు, మొదట రుణాన్ని త్వరగా చెల్లించడంపై దృష్టి పెట్టండి. ఆ క్రమంలో అధిక వడ్డీ రేటు ఉన్న రుణాలను తొలగించడం, దాని పై చెల్లించే మొత్తం వడ్డీని తగ్గిస్తుంది. ఈ క్రమంలో మీరు నెలకు రూ. 15,000 రుణం చెల్లించే విధంగా ప్లాన్ చేసుకోండి. దీంతోపాటు మీకు కుదిరిన సమయంలో ఏదైనా పార్ట్ టైం జాబ్ చేయడం ద్వారా వచ్చిన మొత్తాన్ని నెలకు రూ. 500 లేదా వెయ్యి నుంచి కూడా మీరు విధానాన్ని మొదలుపెట్టవచ్చు.

మూడేళ్ల తర్వాత..ఆ క్రమంలో మీరు ఓ మూడేళ్లు రూ.15 వేల చొప్పున చెల్లిస్తే మీ రుణం దాదాపు సగానికిపైగా పూర్తవుతుంది. ఆ క్రమంలో మీరు మీ సిప్ చెల్లింపులను క్రమంగా పెంచుకోండి. మొదటి మూడేళ్ల తర్వాత మీ పొదుపును రూ. 5,000-7,000 మధ్య పరిమాణంలో చేయవచ్చు. ఇది చిన్న మొత్తంగా ప్రారంభించి రుణం పూర్తైన తరువాత దీనిని మరింత పెంచుకోవచ్చు. అంతేకాదు తర్వాత మీకు పెరిగిన ఆదాయం లేదా తగ్గిన ఖర్చులను బట్టి మొత్తాన్ని రూ. 10,000-12,000 వరకు కూడా పెంచుకోవచ్చు. తద్వారా మీ పెట్టుబడులను మరింత విస్తరించుకోవచ్చు. దీని వల్ల మీరు దీర్ఘకాలిక పెట్టుబడిలో మంచి ప్రగతిని సాధించి పెద్ద మొత్తాన్ని పొందుతారు.

## వరల్డ్ ఫస్ట్ సీఎన్జీ స్కూటర్ టీవీఎస్ జూపిటర్.. ఇవీ ఫీచర్లు..!




**న్యూఢిల్లీ-నవభూమి:** పెట్రోల్‌తో నడిచే టూ వీలర్లను తయారు చేసిన ఆటోమొబైల్ సంస్థలు ఇప్పుడు సీఎన్జీ వినియోగ వాహనాల తయారీ వైపు మళ్లుతున్నారు. ఇప్పటికే బజాజ్ ఆటో.. ప్రపంచంలోనే తొలి బజాజ్ సీఎన్జీ మోటారు సైకిల్‌ను ఆవిష్కరించింది. అదే బాటలో ప్రయాణిస్తున్న టీవీఎస్ మోటార్స్.. వరల్డ్ ఫస్ట్ సీఎన్జీ స్కూటర్‌ను శనివారం భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో-2025లో ప్రదర్శించింది. టీవీఎస్ తన జూపిటర్ స్కూటర్ కాన్సెప్ట్ మోడల్‌ను ప్రదర్శించింది. త్వరలో ఇది కస్టమర్లకు చేరువ కానున్నది.

బజాజ్ ఫ్రీడం 125సీఎన్జీ మోటార్ సైకిల్ మాదిరిగానే టీవీఎస్ జూపిటర్ సీఎన్జీ స్కూటర్ పని చేస్తుంది. 125సీసీ పెట్రోల్ మోడల్ స్కూటర్ తరహాలోనే సీఎన్జీ స్కూటర్ డిజైన్ చేశారు. ఈ స్కూటర్‌లో 1.4 కిలోల సీఎన్జీ ట్యాంకుతోపాటు రెండు లీటర్ల పెట్రోల్ ట్యాంకు కూడా ఉంటుంది. ఒక కిలో సీఎన్జీతో టీవీఎస్ జూపిటర్ స్కూటర్ 84 కి.మీ దూరం ప్రయాణించవచ్చు. ఒక్కసారి ట్యాంక్ నింపితే 226 కి.మీ దూరం వరకూ ప్రయాణించవచ్చు. ఈ స్కూటర్ ఇంజిన్ గరిష్టంగా 5.3 బీహెచ్‌పీ పవర్, 9.4 ఎన్ఎం టార్క్ వెలువరిస్తుంది.ప్రస్తుతం టీవీఎస్ జూపిటర్ రూ.88,174 (ఎక్స్ షోరూమ్) నుంచి రూ.99,015 (ఎక్స్ షోరూమ్) మధ్య పలుకుతుంది. ఈ పరిస్థితుల్లో సీఎన్జీ టీవీఎస్ స్కూటర్ ధర రూ.90,000 నుంచి రూ. 99,000 (ఎక్స్ షోరూమ్) ఉంటుందని భావిస్తున్నారు. ఫోన్ చార్జింగ్ కోసం యూఎస్బీ చార్జింగ్ పోర్ట్, స్టాండ్ కటాఫ్ సేఫ్టీ సిస్టమ్, బ్లూటూత్ కనెక్టివిటీ సపోర్ట్ తదితర ఫీచర్లు ఉంటాయి. టీవీఎస్ జూపిటర్ సీఎన్జీ స్కూటర్ ఎకనమికల్, ఎకో ఫ్రెండ్లీ

## లగ్జరీ ఇండ్లకు ఫుల్ గిరాకీ.. భారీగా తగ్గిన చౌక ఇండ్ల సేల్స్ .. కారణమిదే..!



**న్యూఢిల్లీ-నవభూమి:** కరోనా మహమ్మారి ప్రభావం తర్వాత ప్రతి ఒక్కరూ సొంతింటి కల సాకారం చేసుకోవడానికి ప్రయత్నించారు. సాధ్యమైనంత వరకూ స్పేసియస్‌గా ఉండే ఇండ్లను సొంతం చేసుకోవడానికి మొగ్గు చూపారు. క్రమంగా విశాలమైన ఇండ్ల నుంచి లగ్జరీ ఇండ్ల కొనుగోలు వైపు కస్టమర్లు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా తక్కువ ధరకే లభించే అపార్ట్‌మెంట్లను కొనుగోలు చేసే వారు తగ్గిపోతున్నారు. 2024లో రూ.50 లక్షల్లోపు ధర గల అపార్ట్‌మెంట్ల విక్రయాలు 14శాతం తగ్గి 38,626 యూనిట్లకు పరిమితం అయ్యాయి. దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లోనూ 'చౌక ధర ఇండ్ల వెంచర్లు' తగ్గిపోయా యని ప్రముఖ రియాల్టీ కన్సల్టెంట్ జేఎల్ఎల్ ఇండియా పేర్కొంది.

అదే సమ యంలో 2024లో ఏడు ప్రధాన నగరాల పరిధిలో అపార్ట్‌మెంట్ల విక్రయాలు సుస్థిర వృద్ధి సాధించాయి. ముంబై (ముంబై సిటీ, ముంబై సబర్బన్, థాణే సిటీ, నవీ ముంబై), ఢిల్లీ-ఎన్సీఆర్ (ఢిల్లీ, గురుగ్రామ్, నొయిడా, గ్రేటర్ నోయిడా, ఘజియాబాద్, ఫరీదాబాద్, సోహ్నా), బెంగళూరు, పుణె, చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా నగరాల పరిధిలో 2023తో పోలిస్తే గతేడాది అపార్ట్‌మెంట్ల విక్రయాలు 11 శాతం పెరిగాయి. 2024లో రికార్డు స్థాయిలో 3,02,867 (2023లో 2,71,818 అపార్ట్‌మెంట్లు) అపార్ట్‌మెంట్ల విక్రయాలు నమోదయ్యాయి. గతేడాది అమ్ముడైన ఇండ్లలో అపార్ట్‌మెంట్లు, రో హౌసెస్, విల్లాలు ఉన్నాయని జేఎల్ఎల్ ఇండియా తెలిపింది.

రూ.50 లక్షల్లోపు ధర గల ఇండ్ల విక్రయాలు 45,160 (2023) నుంచి 38,626 యూనిట్లకు పరిమితం అయ్యాయి. రూ.కోటి ధర గల ఇండ్ల విక్రయాలు 2023లో 1,02,685 యూనిట్లు ఉంటే, 2024 లో 1,02,886 యూనిట్లు అమ్ముడయ్యాయి. రూ.కోటి నుంచి రూ.3 కోట్ల లోపు విలువ గల ఇండ్లకు డిమాండ్ పెరిగింది. 2023తో పోలిస్తే 2024లో రూ.కోటి-రూ.3 కోట్ల విలువ గల ఇండ్ల విక్రయాలు 18 శాతం పెరిగి 1,01,451 యూనిట్ల నుంచి 1,19,990 యూనిట్లకు పెరిగాయి.

రూ.3-5 కోట్ల మధ్య విలువ గల ఇండ్ల విక్రయాలు 86 శాతం వృద్ధి చెందాయి. 2023లో 13,881 ఇండ్లు అమ్ముడైతే 2024లో 25,833 యూనిట్ల ఇండ్లు విక్రయించారు. ఇక రూ.5 కోట్ల పై చిలుకు ధర గల లగ్జరీ ఇండ్లకూ 80శాతం గిరాకీ పెరిగింది. 2023లో కేవలం 8,641 యూనిట్ల ఇండ్లు విక్రయిస్తే, గతేడాది 15,532 యూనిట్లకు పెరిగాయి. పట్టణీకరణ, మౌలిక వసతుల అభివృద్ధితో ప్రీమియం ఇండ్లకు గిరాకీ ఎక్కువైంది. ప్రజల ఆదాయం పెరుగుదలతోపాటు జీవన ప్రమాణాల్లో మార్పులు కూడా లగ్జరీ ఇండ్లకు గిరాకీ పెరగడానికి కారణం అని జేఎల్ఎల్ ఇండియా తెలిపింది.

## సోలార్ పవర్‌తో నడిచే కారు వేవ్ ఇవా..ఇవీ స్పెషిఫికేషన్స్ !



**న్యూఢిల్లీ-నవభూమి:** పర్యావరణ పరిరక్షణ.. పెట్రోల్-డీజిల్ భారం తగ్గించుకునేందుకు ఆల్టర్నేటివ్ ఫ్యుయల్ వాహనాలు.. ప్రత్యేకించి ఎలక్ట్రిక్, హైబ్రీడ్ వాహనాల తయారీ మొదలైంది. తాజాగా సోలార్ పవర్‌తోనూ నడిచే కారు కూడా వచ్చేసింది. ఢిల్లీలో జరుగుతున్న భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో వేవ్ మొబిలిటీ శనివారం సోలార్ పవర్‌తో నడిచే తన ఇవాకారును ఆవిష్కరిం చింది.

వేవ్ ఇవా కారు మూడు వేరియంట్లు నోవా స్టెల్లా వెగా వేరియంట్లలో లభిస్తుంది. ఈ కారు ధర రూ.3.25 లక్షల (ఎక్స్ షోరూమ్) ఉంటుంది. కారు సబ్‌స్క్రిప్షన్‌లు ప్రారంభం అయ్యాయి. బ్యాటరీ ధర రూ.3.99 లక్షలు (ఎక్స్ షోరూమ్) ఉంటుంది. అంటే కారు ధర రూ.6 లక్షల వరకూ పలుకుతుందని భావిస్తున్నారు. ఈ ధరలు తొలి 25 వేల మంది కస్టమర్లకు మాత్రమే పరిమితం అని వేవ్ తెలిపింది.తొలుత 2023 ఎక్స్‌పోలోనే వేవ్ మొబిలిటీ తన సౌర విద్యుత్ వినియోగ కారు ఇవా ను ఆవిష్కరించింది. పట్టణ ప్రాంతాల్లో పర్యటించే వారికి సుస్థిరమైన ట్రావెలింగ్ ఆప్షన్‌గా ఈ కారు ఉంటుంది. సింగిల్ చార్జింగ్‌తో 250 కి.మీ దూరం ప్రయాణిస్తుందీ కారు. సౌర విద్యుత్‌తో పని చేయడం వల్ల అదనంగా 3,000 కి.మీ దూరం ప్రయాణిం చగల సామర్థ్యం కలిగి ఉంటుందీ కారు. వేవ్ ఇవా కారు హై ఓల్టేజ్ పవర్‌ట్రైన్ మోటారుతో వస్తోంది. సూపర్ ఫాస్ట్ చార్జింగ్ సామర్థ్యంతో కేవలం ఐదు నిమిషాల చార్జింగ్‌తో 50 కి.మీ దూరం అదనంగా ప్రయాణించొచ్చు.ఇందులో స్మార్ట్ ఫోన్ ఇంటిగ్రేషన్, ఓవర్ ది ఎయిర్ (ఓటీఏ) అప్‌డేట్స్, రిమోట్ మానిటరింగ్, వెహికల్ డయాగ్నిసిస్ వంటి ఫీచర్లు ఉంటాయి. ఖర్చులు తగ్గించేలా లైట్ వెయిట్ డిజైన్‌తో వస్తోందీ కారు.

ఎంజీ కామెట్ ఈవీ కి వేవ్ ఇవా గట్టి పోటీ ఇస్తుందని భావిస్తు న్నారు. అర్బన్ మొబిలిటీ అవసరాలు తీర్చుకోవడానికి ఉపకరిస్తుంది. సగటున ప్రతి రోజూ 35 కి.మీ దూరం ప్రయాణించొచ్చు. మోడర్న్ ఫ్యామిలీకి కోసం ఇన్నోవేషన్‌తో రూపొందించిన అర్బన్ వెహికల్ ఇది అని వేవ్ మొబిలిటీ సీఈఓ కం కో ఫౌండర్ నీలేశ్ బజాజ్ చెప్పారు.

# బలపడుతున్న డాలర్

**న్యూఢిల్లీ-నవభూమి:** రూపాయి పతనం ఆగేదెక్కడ..? రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే భారీగా క్షీణించడం ఆర్థిక వ్యవస్థపై విస్తృతమైన ప్రభావాన్ని చూపుతున్నది. 2025, జనవరి 13న రూపాయి విలువ 86.62గా నమోదు కావడం రెండేండ్ల అత్యల్ప స్థాయిని సూచిస్తున్నది. ఈ పరిస్థితి రూపాయి బలహీన తను, అంతర్జాతీయ పరిస్థితుల్లో మార్పులను ప్రతిబింబిస్తున్నది.

అమెరికా ఆర్థిక వ్యూహాలు, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపు ప్రభావంతో డాలర్ బలపడింది. డాలర్ ఇండెక్స్ 110 స్థాయిని దాటింది. అమెరికా ఎన్నికల అనంతరం డాలర్ డిమాండ్ పెరగడం రూపాయి పతనానికి కారణమైంది. ముడి చమురు ధరల పెరుగుదల మరో కారణంగా చూడవచ్చు. బ్రెంట్ క్రూడాయిల్ ధర 80 డాలర్లకు చేరడం రూపాయి విలువపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నది. ఫలితంగా భారత్ వంటి చమురు దిగుమతిదారులపై అధిక భారం పడుతున్నది. భారత మార్కెట్లలో నెగెటివ్ సెంటిమెంట్ పెరగడంతో విదేశీ పెట్టుబడులు తగ్గడం కూడా రూపాయి పతనానికి మరో కారణం అనుకోవచ్చు.

రూపాయి పతనంతో సామాన్య ప్రజలపై భారం పడుతున్నది. పెట్రోల్, డీజిల్ ధరలు మరింత



పెరిగే అవకాశం ఉన్నది. దిగుమతులతో సంబంధమున్న వస్తువుల ధరలు అధికమవుతాయి. విదేశీ విద్య భారంగా మారుతుంది. ఎగుమతులపై రూపాయి పతనం ప్రభావం చూపుతుంది. ఎగుమతులకు కొంతకాలం మద్దతు అందించినా, దీర్ఘకాలంలో దిగుమతుల వ్యయాన్ని తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవడం అవసరం. రూపాయి పతనం ఆర్థిక వ్యవస్థపై నేరుగా ప్రభావం చూపుతుంది. విదేశీ మారక ద్రవ్య నిల్వలు తగ్గిపోతాయి. పరిశ్రమలపై ప్రభావం చూపుతుంది. చమురు ఆధారిత పరిశ్రమలు, దిగుమతి వ్యాపార సంస్థలు నష్టాల బారినపడే అవకాశం ఉంటుంది.

రూపాయి విలువ స్థిరీకరణ కోసం ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్లో ఆర్బీఐ జోక్యం చేసుకోవాలి. వడ్డీ రేట్లను సర్దుబాటు చేయడం ద్వారా ద్రవ్యోల్బణ నియంత్రణ చేపట్టాలి. భారతీయ ఉత్పత్తుల పోటీదనాన్ని పెంచేందుకు విధానాలు అమలు చేయడం, కొత్త అంతర్జాతీయ మార్కెట్లను అన్వేషించడం, ఎగుమతులకు ప్రోత్సాహం అందించడం వంటి చర్యలు సానుకూల ఫలితాలను అందిస్తాయి. అవసరమైన వస్తువుల స్థానిక ఉత్పత్తిని పెంచడం, దిగుమతులను తగ్గించడం, స్వదేశీ చమురు, గ్యాస్ వనరుల శోధన, వాడకం పెంపు వంటి చర్యలు చేపట్టడం వలన రూపాయి పతనాన్ని నిలువరించవచ్చు . మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడం, ప్రైవేట్, ప్రభుత్వ రంగాలలో స్వదేశీ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా పతనాన్ని అడ్డుకోవచ్చు.

రూపాయి పతనం భారత ఆర్థిక పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతున్నప్పటికీ, సమర్థమైన వ్యూహాలను అమలు చేయడం ద్వారా దీన్ని అదుపులోకి తేవడం సాధ్యమే. సత్వర చర్యలతో పాటు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపాయి విలువను స్థిరంగా ఉంచడానికి సహాయపడతాయి. భారత ప్రభుత్వం, ఆర్బీఐ కలసి సమన్వయంతో చర్యలు తీసుకుంటే, రూపాయి పతనాన్ని ఆపొచ్చు. దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చు.

## ఇన్ఫోసిస్ నారాయణ మూర్తికి షాక్.. భారీగా తగ్గిన సంపద



**న్యూఢిల్లీ-నవభూమి:**వారానికి 70 గంటల పని దినాన్ని సిఫార్సు చేసిన ఇన్ఫో సిస్ నారాయణ మూర్తి శుక్రవారం భారీ నష్టాన్ని చవిచూ శారు. ఇన్ఫోసిస్ లిమిటెడ్ షేర్లలో దాదాపు 6% పతనమయ్యా యి. ఈ క్రమంలో ఇతర ఐటీ రంగ స్టాక్‌లు, సెన్సెక్స్, నిఫ్టీ వంటి కీలక సూచీలపై ప్రభావం చూపడమే కాకుండా, కంపెనీ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి కుటుంబ సభ్యుల సంపదపై కూడా ప్రభావం పడింది.ఇదే సమయంలో బీఎస్ఈలో ఇన్ఫోసిస్ షేర్లు 5.89% తగ్గి రూ. 1,812.70 వద్ద ముగిశాయి. కంపెనీ బలమైన ఫలితాలను నమోదు చేసిన తర్వాత ఈ తగ్గుదల కనిపించింది. ఇందులో 1.7% ఆదాయ వృద్ధి ఉంది. అయితే విశ్లేషకుల ప్రకారం ఈ వృద్ధి ప్రధానంగా పాస్-త్రూ ఆదాయం, ఇన్-ఆర్గానిక్ సహకారం నుంచి వచ్చిందని నమ్ముతున్నారు. అయితే ప్రధాన వ్యాపారంలో మాత్రం ఎటువంటి వృద్ధి కనిపించలేదు. ఇన్ఫోసిస్ తన ఉత్పత్తుల స్థాయిని పెంచేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, నూతన వ్యాపార ఒప్పందాలు లేకపోవడం, పెట్టుబడిదారులలో అనిశ్చితి కలిగించడం, భారీగా వృద్ధి అవకాశాలు లేకపోవడం వంటి విషయాలు ఇన్ఫోసిస్ పెట్టుబడులకు ప్రతికూలంగా మారాయి.సెప్టెంబర్ త్రైమాసికం చివరి నాటికి మూర్తి కంపెనీలో 0.40% వాటాను కలిగి ఉండగా, ఆయన భార్య సుధా మూర్తి 0.92% వాటాను కలిగి ఉన్నారు. ఆయన కుమారుడు రోహన్ మూర్తి, కుమార్తె, మాజీ బ్రిటిష్ ప్రధాన మంత్రి రిషి సునక్ భార్య అక్షత మూర్తి వరుసగా 1.62%, 1.04% వాటాను కలిగి ఉన్నారు. ఆయన మనవడు ఏకగ్రహ మూర్తి కూడా 0.04% వాటాను కలిగి ఉన్నాడు. ఈ క్రమంలో మూర్తి కుటుంబం మొత్తం 4.02% వాటాను కలిగి ఉంది. దీని విలువ గురువారం దాదాపు రూ. 32,152 కోట్లు ఉండగా, శుక్రవారం షేర్లు పడిపోయిన తర్వాత ఇది రూ. 30,300 కోట్లకు పడిపోయింది. ఫలితంగా కుటుంబ సంపదకు రూ.1,850 కోట్లు తగ్గిపోయింది.

**క్షీణత ఎందుకు సంభవించింది?**

3లో పెద్ద ఒప్పందాలు లేకపోవడం, FY26లో రెండంకెల వృద్ధి అవకాశాలపై అనిశ్చితి పెట్టుబడిదారుల ఆందోళనలను పెంచింది. ఈ నేపథ్యంలో కి మెరుగైన ఆదాయ మార్గదర్శకత్వం ఉన్నప్పటికీ, లో కాలానుగుణ బలహీనత, మూడో పక్ష ఆదాయాలలో క్షీణత వచ్చింది. దీంతో ఇది ఖర్చు తగ్గించే ఒప్పందాలపై ప్రభావం చూపిందని ఇన్ఫోసిస్ యాజమాన్యం తెలిపింది.

అయితే వారు ప్రస్తుతం BFSI, రిటైల్ రంగాలలో మెరుగుదల సంకేతాలను చూస్తున్నారు. ఇది భవిష్యత్తులో కంపెనీ పనితీరును మెరుగుపరుస్తుందని చెప్పవచ్చు. ఈ రెండు రంగాలలో జాగ్రత్తగా పెరుగుదల ఉంటుందని అంచనా వేసింది. అలాగే విచక్షణా వ్యయంలో పెరుగుదల, బహుళ పరిమాణ రంగాలలో పెరుగుదల భవిష్యత్తులో కంపెనీ పనితీరును మెరుగుపరుస్తుందని భావిస్తున్నారు.


## ఊహించని రేటుకు చేరిన బంగారం.. ఇలా షాక్ ఇచ్చిందేంటి..



**న్యూఢిల్లీ-నవభూమి:**బంగారం ధరలు రోజురోజుకీ షాక్ ఇస్తున్నాయి. గడిచిన ఏడాది ఆఖరి వరకు కాస్త తగ్గుతూ వచ్చిన పసిడి.. ఇప్పుడు కొండెక్కింది. అమాంతం ఊహించని రేటుకు చేరింది గోల్డ్.

గతేడాది ఆఖరి వరకు బంగారం అందర్నీ ఊరిస్తూ వచ్చింది. గోల్డ్‌తో పాటు సిల్వర్ రేట్స్ తగ్గుతూ వచ్చాయి. అంతకుముందు వరకు పెరుగుతూ ఉన్న ధరలు క్రమేపీ తగ్గుతూ రావడంతో మహిళలతో పాటు గోల్డ్ లవర్స్ కొనేందుకు ఉత్సాహం చూపించారు. అయితే కొత్త ఏడాదిలో మాత్రం పసిడి, వెండి తగ్గేదేలే అంటూ దూసుకెళ్తున్నాయి. రయ్‌రయ్‌మని పరుగులు తీస్తూ రికార్డు స్థాయికి చేరుకున్నాయి. ఏకంగా 80 వేల మార్క్‌ను దాటేసి పరుగులు పెడుతోంది గోల్డ్. 2025, జనవరి 18 (శనివారం) ఉదయం చూసుకుంటే.. 22 క్యారెట్ల తులం బంగారం రూ.74,510గా ఉంది.

ఇవాళ 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.81,280గా ఉంది. వెండి ధరలు కూడా పెరిగాయి. శనివారం పొద్దున కిలో వెండి ధర రూ.96,600గా ఉంది. తులం బంగారం మీద రూ.10 మేర పెరగగా.. అదే సిల్వర్‌పై రూ.100 మేర రేటు పెరిగింది. అంతర్జాతీయ పరిణామాలను బట్టి బంగారం, వెండి ధరల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అయితే పైన పేర్కొన్న ధరలు జనవరి 18 ఉదయానికి సంబంధించినవి. ఒక్కోసారి మధ్యాహ్నానికే వాటి రేట్లలో పెరుగుల, తగ్గుదల చోటుచేసుకుంటూ ఉంటాయి. కాబట్టి బంగారం, వెండి క్రయవిక్రయాలకు ముందు సమీప ప్రాంతాల్లో వాటి ధరలు తెలుసుకోవడం చాలా మంచిది.



# గ్రామంలో పడిన రీసెర్చ్ పేలోడ్ బెలూన్.. భయాందోళన చెందిన జనం


నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

7 | హైదరాబాద్ ఆదివారం 20 | జనవరి | 2025




**బెంగళూరు-నవభూమి:** సైంటిఫిక్ రీసెర్చ్ పేలోడ్ ఉన్న పెద్ద బెలూన్ ఒక గ్రామంలో పడింది. దీనిని చూసి అక్కడి జనం భయాందోళన చెందారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కర్ణాటకలోని బీదర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. అంతరిక్ష పరిశోధనలకు సంబంధించిన పరికరం ఉన్న పెద్ద బెలూన్ ఆకాశం నుంచి దిగి జల్సంగి గ్రామంలో శనివారం పడింది. దీనిని చూసి గ్రామస్తులు భయాందోళన చెందారు. ఆ పరికరానికి చెందిన రెడ్ లైట్ వెలుగుతుండటం చూసి వారు మరింత ఆందోళనకు గురయ్యారు. దీని గురించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.కాగా, రీసెర్చ్ బెలూన్ పడిన ప్రాంతానికి పోలీసులు చేరుకున్నారు.

గుమిగూడిన జనాన్ని దూరంగా వెళ్లాలని సూచించారు. ఉపగ్రహ పేలోడ్ ఉన్న ఆ బెలూన్ హైదరాబాద్‌లోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్(టీఐఎఫ్ఆర్)కు చెందినదిగా గుర్తించారు. ఆ రీసెర్చ్ బెలూన్ గురించి కన్నడలో రాసి ఉన్న నోట్‌ను కూడా ఆ పరికరం వద్ద ఉండటాన్ని గమనించారు. మరోవైపు గ్రామంలో పడిన రీసెర్చ్ బెలూన్‌కు సంబంధించిన వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

## ఆప్‌తో పొత్తు లేదు కానీ.. డోర్లు మూసుకుపోలేదు



**న్యూఢిల్లీ-నవభూమి:** ఆమ్ ఆద్మీ పార్టీతో పొత్తు లేదు కానీ తలుపులు మూసుకుపోలేదని కాంగ్రెస్ సీనియర్ నేత, ఏఐసీసీ కోశాధికారి అజయ్ మాకెన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జాతీయ స్థాయిలో "ఇండియా" కూటమి భాగస్వాములుగా ఉన్న కాంగ్రెస్, ఆప్.. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ప్రత్యర్థులు తలపడుతున్నాయి. అరవింద్ కేజ్రీవాల్ సారథ్యంలోని ఆప్‌కు కాంగ్రెస్ సపోర్ట్ చేసే అవకాశాలున్నాయా అని మాకెన్‌ను మీడియా అడిగినప్పుడు, అవసరమైతే అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఉండొచ్చని, అయితే ఇది తన వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని ఆయన సమాధానమిచ్చారు.

ఆప్‌తో పొత్తు తగదనేది నా వ్యక్తిగత అభిప్రాయం. 2013లో, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆప్‌కు కాంగ్రెస్ సపోర్ట్ సరికాదని నేను అనుకుంటున్నాను. అయితే ఇది నా వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే" అని మాకెన్ తెలిపారు. కేజ్రీవాల్ 'యాంటీ నేషనల్' అంటూ గతంలో చేసిన వ్యాఖ్యలపై అడిగినప్పుడు, తాను తన వ్యక్తిగత అభిప్రాయం చెప్పానని, దానికి కట్టుబడి ఉంటానని అన్నారు. 2013లో ఆప్‌కు కాంగ్రెస్ మద్దతు ఇవ్వడం, 2024లో జతకట్టడం వల్ల కాంగ్రెస్‌కు నష్టం జరిగిందని ఆయన చెప్పారు. ఢిల్లీ ప్రజలు సమస్యలు ఎదుర్కోవడం వల్ల బీజేపీకి లబ్ధి చేకూరుతుందనేది తన నిశ్చితాభిప్రాయమని అన్నారు. కేజ్రీవాల్‌కు ఢిల్లీలో ప్రాముఖ్యత పెరిగితే అది బీజేపీకే కలిసొస్తుందని, బీజేపీతో పోరాడాలంటే జాతీయ స్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉండటం అవసరమని అన్నారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ బలంగా లేకపోతే బీజేపీతో పోరాడటం కష్టమని అభిప్రాయం వ్యక్తం చేశారు.రాజకీయంగా ఢిల్లీకి అంతగా ప్రాధాన్యం లేని విషయాన్ని ప్రశ్నించినప్పుడు, అది అందరికీ తెలిసినదేనని, ఢిల్లీలో లోక్‌సభ ఎన్నికలు గెలుచుకున్న పార్టీనే కేంద్రంలో అధికారం ఏర్పాటు చేస్తుంటుందని, ఢిల్లీలో బీజేపీతో పోరాటంలో ఆప్ విఫలమవుతోందని చెప్పారు. హర్యానా, ఢిల్లీలో ఆప్‌తో కాంగ్రెస్ పొత్తు పెట్టుకోవాలని అనుకుందని, అయితే జైలు నుంచి విడుదల కాగానే హర్యానాలోని 90 స్థానాల్లోనూ తమ పార్టీ పోటీ చేస్తుందని కేజ్రీవాల్ ప్రకటించారని గుర్తు చేశారు. అప్పటికే పొత్తు చర్చలు అడ్వాన్స్డ్ స్థాయిలో ఉన్నాయని చెప్పారు. ఢిల్లీ విషయంలో కూడా లోక్‌సభ ఎన్నికలు కాగానే ఢిల్లీలో సొంతంగా పోటీ చేస్తామని కేజ్రీవాల్ ప్రకటించారని అన్నారు. ఢిల్లీలో షీలాదీక్షిత్ ప్రభుత్వం ఉన్నప్పుడు కాంగ్రెస్ మొత్తం 7 లోక్‌సభ స్థానాలను సొంతంగా గెలుచుకుందని, బీజేపీ నిలువరించిందని చెప్పారు. ఎప్పుడైతే ఆప్ ఢిల్లీలో అధికారంలోకి వచ్చిందో, ఢిల్లీలోని లోక్‌సభ స్థానాలన్నింటినీ బీజేపీ గెలుచుకుని కేంద్రంలో అధికారంలోకి వస్తోందన్నారు. అప్పుడు బీజేపీతో ఉన్నది ఎవరు? అని అజయ్ మాకెన్ ప్రశ్నించారు.

## కన్నకుమార్తెతో వ్యభిచారం చేయించిన తల్లిదండ్రులు.. వీడియోలు, ఫోటోలతో డబ్బు సంపాదన



**చెన్నై-నవభూమి:** డబ్బు సంపాదన కోసం ఓ తల్లిదండ్రులు.. తమ కన్న కుమార్తెను వ్యభిచార ఊబిలోకి దింపారు. మైనర్ కుమార్తెతో వ్యభిచారం చేయించడమే కాకుండా ఆమె వీడియోలు, ఫోటోలు తీశారు. ఆ ఫోటోలు, వీడియోలను తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో విక్రయించి డబ్బులు సంపాదిస్తున్నట్లు గుర్తించారు. అయితే తమ కుమార్తెను మాత్రమే కాకుండా మరికొంత మంది మైనర్లను కూడా వాళ్ల ఇలాగే వ్యభిచార రొంపిలోకి దింపి.. కాసుల కూడబెడుతున్నట్లు పోలీసులు గుర్తించి.. వారిద్దరినీ అరెస్ట్ చేశారు.

కడుపున పుట్టిన బిడ్డ ఎంత పెద్దదైనా.. తల్లిదండ్రులకు పసిపాప లాంటి వారే. పెళ్లి అయి అత్తగారింటికి పంపించినా.. తమ కుమార్తెను ఏ తల్లిదండ్రులైనా.. చిన్న పిల్లలాగే భావిస్తారు. ఆమెకు ఏ చిన్న కష్టం వచ్చినా.. తల్లిదండ్రులుగా ముందు బాధపడతారు. కంటికి రెప్పలాగా కాపాడుకుంటూ.. వారికి ఎలాంటి ఇబ్బంది రాకుండా కాపాడుకుంటారు. సాధారణంగా ఏ తల్లిదండ్రులైనా చేసేది అదే కానీ.. ఈ తల్లిదండ్రుల గురించి వింటే మాత్రం అసలు వాళ్లు తల్లిదండ్రులా లేక కసాయి వారా అనే అనుమానం కలగకమానదు. సొంత కుమార్తెతో వ్యభిచారం చేయించి.. ఆ ఫోటోలు, వీడియోలను అమ్ముకుని డబ్బులు సంపాదించుంటున్న కసాయి తల్లిదండ్రుల వ్యవహారం బయటికి రావడం తీవ్ర దుమారం రేపుతోంది. తమిళనాడులో జరిగిన ఈ ఘటన ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

తమిళనాడు రాజధాని చెన్నైలో వెలుగులోకి వచ్చిన ఈ షాకింగ్ ఘటన.. సిగ్గుతో సమాజం తలదించుకునేలా చేసింది. చెన్నైలోని ఒక బిజినెస్‌మెన్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు.. అతడి ఫోన్‌లో అశ్లీల చిత్రాలు, ఫోటోలు గుర్తించారు. అందులో చాలావరకు మైనర్ బాలికలకు సంబంధించిన వీడియోలే ఉండటం గమనార్హం. అంతేకాకుండా ఆ వీడియోలు కూడా వారికి తెలియకుండా రహస్యంగా తీసినట్లు ఉన్నాయని.. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న అధికారి ఒకరు వెల్లడించారు. ఇదంతా చేయడానికి ఆ బిజినెస్‌మెన్‌కు ఆయన భార్య సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. మరీ దారుణమైన విషయం ఏంటంటే.. ఆ వీడియోల్లో ఆ జంట కుమార్తె కూడా ఉండటమే.

తమ కుమార్తెతోపాటు ఇతర బాలికలను వ్యభిచారంలోకి నెట్టి.. వారి అశ్లీల చిత్రాలు, వీడియోలను చిత్రీకరించినట్లు పోలీసులు గుర్తించారు. డబ్బులు సంపాదించడం కోసం ఆ వీడియోలను ఇంటర్నెట్‌లో అప్‌లోడ్ చేసేవారని గుర్తించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన చెన్నై పోలీసుల బృందం.. ఆ జంటను కనిపెట్టి అరెస్ట్ చేసింది. వారి మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. అందులో మైనర్ బాలికలకు సంబంధించిన అనేక అశ్లీల వీడియోలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం వారిద్దరిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. దీంతో వారిద్దరికీ కోర్టు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ఇక వారి కుమార్తెను ప్రభుత్వ సంరక్షణ కేంద్రంలో ఉంచారు. అక్కడ ఆమెకు కౌన్సెలింగ్ ఇప్పించారు. మరోవైపు.. ఇలాంటి ఘటనే కొన్ని రోజుల క్రితం మహారాష్ట్ర రాజధాని ముంబైలో చోటు చేసుకుంది. ఒక మహిళ తన మైనర్ కుమార్తెను వ్యభిచారంలోకి నెట్టినట్లు ఆరోపణలు రుజువు కావడంతో ముంబైలోని ప్రత్యేక కోర్టు ఆమెకు 9 సంవత్సరాల జైలు శిక్ష విధించింది.

## టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా ట్వీట్.. నిమిషాల్లోనే సారీ చెప్పిన స్విగ్గీ, ఇంతకీ ఏం జరిగిందంటే?



**న్యూఢిల్లీ-నవభూమి:** తృణముల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ మహువా మొయిత్రా చేసిన ట్వీట్‌కు నిమిషాల్లోనే స్విగ్గీ స్పందించింది. స్పందించడమే కాదు సారీ కూడా చెప్పింది. స్విగ్గీ నుంచి మహువా మొయిత్రా ఒక ఐస్‌క్రీమ్ ఆర్డర్ పెట్టగా.. అది సరిగా లేకపోవడంతో ఆమె తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. దీంతో ఈ వ్యవహారం గురించి ఆమె ట్వీట్ చేసి.. తన అసహనాన్ని వ్యక్తం చేశారు. ఇక ఆ ట్వీట్ కాస్తా స్విగ్గీ వరకు చేరడంతో.. ఆ సంస్థ రీట్వీట్ చేస్తూ క్షమాపణలు చెప్పింది. టీఎంసీ ఫైర్ బ్రాండ్ ఎంపీ మహువా మొయిత్రా మరోసారి వార్తల్లో నిలిచారు. బీజేపీ ప్రభుత్వంపై, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై పార్లమెంటులో, మీడియా ముందు తీవ్రంగా విమర్శలు చేసే మహువా మొయిత్రా.. లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రశ్నలు అడిగేందుకు డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు రావడంతో ఒక్కసారిగా దేశవ్యాప్తంగా ఆమె పేరు మార్మోగిపోయింది. ఈ నేపథ్యంలోనే గత లోక్‌సభ పదవీ కాలంలోనే మహువా మొయిత్రా ఎంపీ పదవిపై వేటు పడటం.. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో ఆమె మళ్లీ ఎంపీగా గెలిచి లోక్‌సభలో అడుగుపెట్టారు. అయితే తాజాగా ఆమె మరోసారి వార్తల్లోకి ఎక్కారు. ఈసారి స్విగ్గీపై ఆమె ఫైర్ అయ్యారు.తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా.. తాజాగా ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీలో ఒక ఐస్‌క్రీమ్ ఆర్డర్ చేసుకున్నారు. అయితే డెలివరీ అయిన ఐస్‌క్రీమ్ పాడైపోయిందని.. ఆమె ట్వీట్ చేయడంతో ఆ ట్వీట్ కాస్తా సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. తాను ఒక ఖరీదైన మైనస్ థర్టీ మినీ స్టిక్స్ ఐస్‌క్రీమ్ ఆర్డర్ చేశానని.. కానీ అది పాడైపోయిందని తెలిపారు. "సారీ స్విగ్గీ.. ఒప్పుకునేదే లేదు.. ఇక మీ గేమ్ ఆపండి. నా డబ్బులు తిరిగి ఇచ్చేయండి. లేదంటే ఆర్డర్ రీప్లేస్ చేయండి" అని మహువా మొయిత్రా ట్వీట్ చేశారు.అయితే మహువా మొయిత్రా ఆర్డర్ చేసిన ఐస్‌క్రీమ్ విలువ రూ.1220 గా ఉంది. ఇక జనవరి 16వ తేదీ రాత్రి 10.12 గంటలకు మహువా మొయిత్రా ఈ ట్వీట్ చేశారు. ఇక ఆమె ట్వీట్ చేసిన సరిగ్గా 22 నిమిషాలకు అంటే రాత్రి 10.34 గంటలకు స్విగ్గీ ఆ ట్వీట్‌కు రిప్లై ఇచ్చింది. "హాయ్ మహువా, మీరు ఆర్డర్ చేసిన ఐస్‌క్రీమ్‌కు సంబంధించి తలెత్తిన సమస్యకు క్షమాపణలు. మీరు చేసిన ఆర్డర్ నంబర్ మాకు పంపించండి. మేం దాన్ని పరిశీలించి సమస్యకు పరిష్కారం కనుగొంటాం" అని స్విగ్గీ కేర్స్ రిప్లై ఇచ్చింది.ఇక ఈ ట్వీట్లు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. కొందరు మహువా మొయిత్రాను స్విగ్గీ నుంచి జొమాటోకు మారాలని సూచించారు. మరికొందరు అయితే జొమాటో కూడా వేస్ట్ అంటూ మండిపడుతున్నారు.

## పాక్ ఉగ్రవాదం ఆ దేశాన్నే కబళిస్తోంది



**ముంబై-నవభూమి:** పొరుగుదేశమైన పాకిస్థాన్ పెంచి పోషిస్తున్న ఉగ్రవాదంపై భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మరోసారి నిప్పులు చెరిగారు. ఉగ్రవాదం అనేది ఒక క్యాన్సర్ వంటిదని, పాక్ పెంచి పోషించిన ఉగ్రవాదం ఇప్పుడు సొంత ప్రజలపైనే ప్రభావం చూపిస్తోందని అన్నారు. శనివారంనాడిక్కడ జరిగిన 19వ నాని ఎ పాల్కీవాలా స్మారకోపన్యాసంలో ఆయన గత దశాబ్ద కాలంలో భారత్ అనుసరిస్తున్న దౌత్య విధానాలపై మాట్లాడారు.

"సీమాంతర ఉగ్రవాదం విషయంలో పొరుగున ఉన్న పాకిస్థాన్ మాత్రమే మినహాయింపుగా ఉంది. పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదం ఇప్పుడు వారి పాలిట శాపమైంది. క్రమంగా అది ఆ దేశ రాజకీయాల్లోకి ప్రవేశిస్తోంది. ఉగ్రవాదాన్ని అణిచివేయాలని భారత్ సహా పలు దేశాలు కోరుతున్నాయి" అని జైశంకర్ చెప్పారు. భారత్‌ను 'విశ్వబంధు'గా ఆయన అభివర్ణించారు. ప్రపంచ దేశాలతో స్నేహాన్ని పెంచుకుంటూ సమస్యలను తగ్గించుకుంటూ విశ్వవేదికపై నమ్మకమైన భాగస్వామిగా భారత్ వ్యవహరిస్తోందని, ప్రపంచ వేదికపై భారత్‌కు దక్కిన గుర్తింపే ఇందుకు నిదర్శనమని అన్నారు. భారత దౌత్య విధానం ప్రధానంగా మూడు అంశాలను అనుసరిస్తోందని, పరస్పర గౌరవం, ప్రయోజనాలు, సుహృద్భావ సంబంధాలనేవి ఆ మూడు అంశాలని చెప్పారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని దౌత్య విధానాలను సాగిస్తున్నామన్నారు.

ఇటీవల చరిత్రలో చోటుచేసుకున్న కొన్ని ఉదాహరణలను జైశంకర్ ప్రస్తావిస్తూ.. "సంక్షోభ సమయంలో ముఖ్యంగా మహమ్మారులు వచ్చినప్పుడు, ఆర్థికమాంద్యం దశలో పొరుగున ఉన్న చిన్న దేశాలకు భారత్ భరోసా కల్పించింది. 2023లో శ్రీలంక సంక్షోభంలో పడినప్పుడు 4 బిలియన్ డాలర్ల ప్యాకేజీ అందజేశాం. బంగ్లాదేశ్‌లో ఇప్పుడు తలెత్తిన క్లిష్ట పరిస్థితులను చూస్తున్నాం. సన్నిహిత సంబంధాలు, సహకారం అనేది ఏదో ఒకరోజు సమస్యల పరిష్కారానికి మార్గమవుతుంది. పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సహకారం అనేది ఉండాలి" అని జైశంకర్ అన్నారు. పొరుగున ఉన్న మయన్మార్, ఆఫ్ఘనిస్థాన్‌తోనూ భారత్‌కు చిరకాల సత్సంబంధాలు ఉన్నాయని చెప్పారు.

## సైఫ్‌కు క్షమాపణలు చెప్పిన బాలకృష్ణ హీరోయిన్ .. ఎందుకంటే..



**ముంబై-నవభూమి:** బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌కు డాకు మహారాజ్ హీరోయిన్ ఊర్వశీ రౌతేలా క్షమాపణలు చెప్పారు. నటుడు బాలకృష్ణకు జోడిగా నటించి అందరి ప్రశంసలు అందుకున్న ఆమె సైఫ్‌కు ఎందుకు క్షమాపణలు చెప్పారు? అసలేం జరిగింది? అనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం..బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై కత్తి దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఓ దుండగుడు సైఫ్ ఇంట్లోకి ప్రవేశించి విచక్షణ రహితంగా దాడికి పాల్పడాడ్డు. ఈ ఘటనలో ఆయన వెన్నుముకకు, మెడ, చేతికి తీవ్ర గాయాలు అయ్యాయి. లీలావతి హాస్పటల్ లో వైద్యులు అతడికి సర్జరీలు చేసి సైఫ్ ప్రమాదం నుండి బయటపడ్డారు అని వెల్లడించారు. అయితే, ఆయనపై దాడి జరిగిన ఘటన అందరినీ కలిచి వేసింది. సినీ ప్రముఖులందరూ ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు.

ఈ క్రమంలోనే ఓ ఇంటర్వ్యూలో హీరోయిన్ ఊర్వశీ రౌతేలా.. సైఫ్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానన్నారు. అయితే, అదే సమయంలో తనకు వచ్చిన బహుమతుల గురించి మాట్లాడారు. దీంతో సైఫ్ గురించి మాట్లాడిన సందర్భంలోనే తన వజ్రపు ఉంగరాన్ని చూపించి మాట్లాడడంపై నెటిజన్లు ఊర్వశీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఊర్వశీ రౌతేలాను తీవ్రంగా ట్రోల్ చేశారు. చివరికి సోషల్ మీడియాలో దుమారంతో ఆమె సైఫ్‌కు క్షమాపణలు చెప్పారు. సైఫ్ గురించి మాట్లాడిన సమయంలో తన ప్రవర్తనకు విచారం వ్యక్తం చేస్తున్నానంటూ ఇన్ స్టా పోస్ట్ చేశారు. సైఫ్‌పై దాడి తీవ్రత తెలిశాక తాను చాలా బాధపడినట్లు తెలిపారు. ఆ సమయంలో సైఫ్ చూపించిన ధైర్యం నిజంగా ప్రశంసనీయమని..ఆయనపై గౌరవం ఇంకా పెరిగిందని పేర్కొన్నారు.కాగా, సైఫ్ అలీఖాన్‌పై దాడి కేసులో అనుమానితుడు తాజాగా అరెస్టు అయ్యాడు. ఛత్తీస్‌గడ్‌లో దుర్గ్ రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఛత్తీస్‌గడ్ వెళ్లిన ముంబై పోలీసులు..అనుమానితుడిని ముంబైకి తరలించనున్నారు.

## త్రివేణి సంగమంలో స్నానం చేసిన రాజ్‌నాథ్ సింగ్

**ప్రయాగ్‌రాజ్-నవభూమి:** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక ఉత్సవంగా ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న 'మహాకుంభ్ మేళా 2025' లో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శనివారంనాడు పాల్గొన్నారు. గంగ, యుమున, సరస్వతీ నదుల సంగమమైన త్రివేణి సంగమంలో పవిత్ర స్నానం ఆచరించారు. గంగా హారతిలో పాల్గొన్నారు. గత ఆరు రోజులుగా జరుగుతున్న ఈ మహొూత్సవంలో ఇంతవరకూ దేశ, విదేశాలకు చెందిన 7.3 కోట్ల మందికి పైగా భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు.

## సైఫ్ అలీఖాన్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లింది ఇబ్రహీం కాదంట.. ఆ ఏడేళ్ల పిల్లాడేనట!



**న్యూఢిల్లీ-నవభూమి:** గురువారం రోజు వేకువజామున 2.30 గంటలకు బాలీవుడ్ స్టార్ హీరో సైఫ్ అలీఖాన్‌పై దాడి జరిగిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఆయనకు ఎన్ని కార్లు ఉన్న దాడి అనంతరం అతడి కుమారుడు ఇబ్రహీం, సైఫ్‌ను ఆటోలో ఆస్పత్రికి తరలించినట్లు పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. అయితే ఆటోలో వెళ్లిన మాట వాస్తవమే అయినా సైఫ్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లింది ఇబ్రహీం కాదని లీలావతి ఆస్పత్రి వైద్యుడు తెలిపాడు. తీవ్ర రక్తస్రావంతో సైఫ్.. ఓ ఏడేళ్ల బాలుడితో అక్కడకు వచ్చినట్లు వివరించాడు. మరి ఆ బాలుడు ఎవరో మనం ఇప్పుడు తెలుసుకుందాం.

బాలీవుడ్ స్టార్ హీరో సైఫ్ అలీఖాన్‌పై గురువారం రోజు వేకువజామున 2.30 గంటలకు దాడి జరిగిన విషయం అందరికీ తెలిసిందే. ముఖ్యంగా కోటి రూపాయలు డిమాండ్ చేస్తూ నిందితుడు హీరోపై ఆరు సార్లు కత్తితో దాడి చేశాడు. ఈక్రమలంనే సైఫ్ తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్ర రక్తస్రావం అవుతుండగానే.. ఆస్పత్రికి వెళ్లాడు. అయితే ఆయన కుమారుడు ఇబ్రహీం అలీఖాన్‌యే అతడిని ఆటోలో ఆస్పత్రికి చేర్పించినట్లు పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. కానీ అదంతా తప్పు అని.. సైఫ్‌తో ఆస్పత్రికి వచ్చింది అతడు కాదని లీలావతి ఆస్పత్రి వైద్యుడు తెలిపారు. ముఖ్యంగా సైఫ్‌తో ఆటోలో వచ్చింది ఓ ఏడేళ్ల బాలుడు అని చెప్పారు. ఆ పూర్తి వివరాలు ఏంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం.కత్తితో తనపై దాడి జరిగిన తర్వాత సైఫ్ అలీఖాన్.. ఒక ఆటోలో లీలావతి ఆస్పత్రికి వెళ్లిన సంగతి తెలిసిందే. అయితే, సైఫ్‌ను లీలావతి ఆస్పత్రికి తీసుకెళ్లిన ఆటో డ్రైవర్ భజన్ సింగ్ రాణా.. తాజాగా మీడియాతో మాట్లాడారు. ఆ రాత్రి ఏం జరిగిందో చెప్పారు. రాత్రి 2 నుంచి 3 గంటల సమేయంలో ఒక మహిళ రోడ్డుపై వెళ్తున్న వాహనాలను ఆపే ప్రయత్నం చేసిందని.. అయితే, ఎవరూ తమ వాహనాలను ఆపలేదని భజన్ సింగ్ చెప్పారు. అప్పుడే.. ఆటో ఆపండి అంటూ గేట్ లోపల నుంచి వచ్చిన మాటలను తాను విన్నానని వెల్లడించారు.

దీంతో వెంటనే తాను యూటర్న్ తీసుకుని వచ్చి గేటు వద్ద ఆటోను ఆపానని తెలిపారు. ఆ సమయంలో లోపలి నుంచి ఒక వ్యక్తి గాయాలతో, రక్తపు మరకలతో రావడం గమనించానన్నారు. అతడితో పాటు మరో నలుగురు వ్యక్తులు కూడా ఉన్నారని.. అయితే అందులో ఓ పిల్లాడు మాత్రమే ఆటోలోకి ఎక్కి లీలావతి హాస్పిటల్‌కి తీసుకెళ్లాలని కోరినట్టు భజన్ సింగ్ వెల్లడించారు. వారు కోరినట్టే తాను లీలావతి హాస్పిటల్ వద్ద డ్రాప్ చేశానని.. అప్పుడే తనకు గాయాలతో ఉన్న వ్యక్తి సైఫ్ అలీఖాన్ అని తెలిసిందని చెప్పారు. సైఫ్ మెడతో పాటు వీపు భాగం నుంచి రక్తం రావడం చూశానని భజన్ సింగ్ వివరించారు.ఆటోలో వెళ్తున్న సమయంలో సైఫ్ రెండు, మూడు సార్లు.. లీలావతి ఆసుపత్రికి చేరుకోవడానికి ఇంకా ఎంత సమయం పడుతుందని అడిగినట్టు ఆటో డ్రైవర్ చెప్పారు. అప్పటికి ఆటోలో ఉన్నది సైఫ్ అనే విషయం తనకు తెలియదని కూడా వివరించారు. అయితే ఆస్పత్రి వద్దకు వెళ్లగానే.. సైఫ్ అలీఖాన్ తన ఏడేళ్ల చిన్న కుమారుడు అయిన తైమూర్ అలీఖాన్ చేయి పట్టుకుని లోపలకు నడుచుకుంటూ వచ్చినట్లు లీలావతి ఆస్పత్రి వైద్యుడు వెల్లడించారు. అందరూ అతడిని ఇబ్రహీం అనుకున్నారు కానీ అది తప్పని.. తైమూర్ అలీఖాన్‌యే తండ్రితో ఆస్పత్రికి వచ్చినట్లు వివరించారు.

## కేజ్రీవాల్‌పై దాడి, భగ్గుమన్న ఆప్.. తిప్పికొట్టిన బీజేపీ



**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఊహించని ఘటన చోటుచేసుకుంది. 'ఆమ్ ఆద్మీ పార్టీ' జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పై ఇటుకలు, రాళ్లతో దాడి జరిగింది. శనివారంనాడు న్యూఢిల్లీ నియోజకవర్గంలో ఆయన ఎన్నికల ప్రచారంలో ఉండగా ఈ ఘటన చోటుచేసుకున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. బీజేపీ 'గూండాలే' ఈ దాడికి పాల్పడినట్టు ఆప్ ఒక ట్వీట్‌లో ఆరోపించింది. ఇందుకు సంబంధించిన వీడియోను పోస్ట్ చేసింది.

"ఓటమి భయంతో బీజేపీ అరవింద్ కేజ్రీవాల్‌పై దాడికి గూండాలను ఉసిగొల్పింది. ఎన్నికల ప్రచారంలో ఉండగా కేజ్రీవాల్‌ను గాయపరిచి ప్రచారం నుంచి దూరంగా ఉండేలా చేసేందుకు బీజేపీ అభ్యర్థి పర్వేష్ గూండాలు ఇటుకలు, రాళ్లు ఆయనపై విసిరారు. బీజేపీ పిరికిపంద దాడులకు కేజ్రీవాల్ భయపడే ప్రసక్తేలేదు. ఢిల్లీ ప్రజలు మీకు (బీజేపీ) గట్టి గుణపాఠం చెబుతారు" అని ఆ పోస్ట్‌లో ఆప్ పేర్కొంది.

పర్వేష్ వర్మ కౌంటర్

'ఆప్' చేసిన ఆరోపణలను పర్వేష్ వర్మ తిప్పికొట్టారు. అరవింద్ కేజ్రీవాల్ వాహనం ఇద్దరు యువకులను ఢీకొట్టిందని ఆయన తెలిపారు. కేజ్రీవాల్‌ను ప్రశ్నించేందుకు వచ్చినప్పుడు కారుతో ఆ యువకులను ఢీకొట్టారని, ఆ ఇద్దర్నీ లేడీ హార్డింగ్ ఆసుపత్రికి తరలించారని చెప్పారు. ఓటమి తప్పదని గ్రహించిన కేజ్రీవాల్ ప్రజల ప్రాణాలను కూడా లెక్కచేడయం లేదని ఆరోపించారు. గాయపడిన యువకులను పరామర్శించేందుకు ఆసుత్రికి వెళ్తున్నట్టు పర్వేష్ వర్మ ఒక 'ట్వీట్' లో తెలిపారు.

## ఢిల్లీలో అప్పటి వరకూ విమాన సర్వీసుల నిర్వహణపై ఆంక్షలు..




**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీలో ఉదయం 10.20 గంటల నుంచి 12.45 గంటలకు వచ్చే ఎనిమిది రోజులు విమాన సర్వీసుల రాకపోకలపై నిషేధం విధించినట్లు ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్ ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయ సంస్థ (డీఐఏఎల్) ప్రకటించింది. ఈ నెల 26న గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుగనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీఐఏఎల్ శనివారం ప్రకటించింది. దేశంలోనే అత్యంత బిజీగా ఉండే విమానాశ్రయంగా ఇందిరాగాంధీ అంతర్జాతీయ సంస్థ (ఐజీఐఏ) నిలుస్తుంది. ప్రతి రోజూ 1300 విమాన సర్వీసులు నడుస్తాయి. ఈ నిషేధాజ్ఞల ప్రభావం షెడ్యూల్డ్ విమాన సర్వీసుల నిర్వహణపై ఉంటుందా? అని వెల్లడి కాలేదు.

'రిపబ్లిక్ డే వీక్ సందర్భంగా నోటమ్ (నోటీస్ టూ ఎయిర్‌మెన్) ప్రకారం ఢిల్లీ విమానాశ్రయం నుంచి ఈ నెల 19 నుంచి 26 వరకూ ఉదయం 10.25 గంటల నుంచి 12.45 గంటల వరకూ విమానాల రాకపోకలు ఉండవు'అని డీఐఏఎల్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేసింది. ప్రయాణికులు సంబంధిత విమానయాన సంస్థలతో తాము ప్రయాణించే విమాన సర్వీసుల అప్‌డేటెడ్ సమాచారం తనిఖీ చేసుకోవాలని సూచించింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
8 | హైదరాబాద్
ఆదివారం
20 । జనవరి । 2025

## 'మా' కు జేసీ ప్రభాకర్‌రెడ్డిపై నటి మాధవిలత ఫిర్యాదు



**హైదరాబాద్-నవభూమి** : సినిమా రంగంలో ఉన్న మహిళలపై అనుచితంగా మాట్లాడిన టీడీపీ నాయకుడు జేసీ ప్రభాకర్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని సినీ నటి మాధవి లత కోరారు. ఈ మేరకు శనివారం 'మా' అసోసియేషన్ ట్రెజరర్ శివ బాలాజీకి ఫిర్యాదును అందజేశారు. సినీరంగంలోని మహిళలపై జరుగుతున్న వ్యక్తిత్వ హననం చేస్తూ సినిమా వారిపై ఆరోపణలు చేయడం కరెక్టు కాదంటూ పేర్కొన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డిపై ఫిల్మ్ ఛాంబర్‌తో పాటు మానవహక్కుల సంఘానికి, పోలీసులకు, ఫిల్మ్ ఇండస్ట్రీకి ఫిర్యాదు చేశాను. ఎవరూ స్పందించలేదు. అందుకే 'మా' కు ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు. న్యాయం కోసం పోరాడుతానంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.





## సామ్ ఎన్నాళ్లీ వెయిటింగ్..?

సౌత్ స్టార్ హీరోయిన్ సమంత ఈమధ్య తెలుగు సినిమాలు చేయడం మానేసింది. విజయ్ దేవరకొండతో ఖుషి సినిమా చేసిన సమంత ఆ తర్వాత మరో తెలుగు సినిమా చేయలేదు. బాలీవుడ్ లో ఒక వెబ్ సీరీస్ ని పూర్తి చేసింది. సిటాడెల్ వెబ్ సీరీస్ తోమరోసారి బాలీవుడ్ ఆడియన్స్‌ని అలరించింది. ఐతే సమంత తెలుగు సినిమాల కోసం ఆమె ఫ్యాన్స్ ఎంతో ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. మా ఇంటి బంగారం సినిమా ప్రకటించింది కానీ ఆ తర్వాత ఎందుకో సైలెంట్ అయిపోయింది. సమంత నెక్స్ట్ సినిమా అప్డేట్ కోసం ఫ్యాన్స్ అంతా ఎదురుచూస్తున్నారు. సౌత్ లో సమంతకు సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. అందుకే ఆమె కమర్షియల్ సినిమాలతో పాటుగా ఫిమేల్ సెంట్రిక్ సినిమాలు కూడా చేస్తూ వచ్చింది. ఐతే ఖుషి సినిమాకు ముందు యశోద, శాకుంతలం సినిమాలు చేసినా అవి ఎందుకో వర్క్ అవుట్ కాలేదు. అందుకే ఈసారి పర్ఫెక్ట్ ప్లానింగ్ తో రావాలని ఫిక్స్ అయ్యింది అమ్మడు. ఐతే విజయ్ దేవరకొండతో చేసిన ఖుషి తర్వాత పూర్తిగా తన ఫోకస్ అంతా కూడా బాలీవుడ్ మీదే పెట్టింది. సమంత తెలుగు సినిమా ఎప్పుడు చేస్తుందా అని ఆమె ఫ్యాన్స్ ఆసక్తిగా ఉన్నారు. ఐతే కమర్షియల్ సినిమా ఆఫర్లు వస్తున్నా కూడా సామ్ ఎందుకో వాటిని కాదనేస్తుందని తెలుస్తుంది. ముఖ్యంగా స్టార్ సినిమాలో ఆఫర్లను సమంత వద్దని చెబుతుందట. ఆమధ్య ఓ సినిమా ఈవెంట్ లో త్రివిక్రం కూడా సమంతని తెలుగు సినిమాలు చేయాలని అన్నాడు. ఐతే మీరు రాస్తే మేము చేస్తామని అన్నది సమంత. సో ఆ లెక్కన చూస్తే సమంత కేవలం ఫిమేల్ సెంట్రిక్ సినిమాలు మాత్రమే చేస్తుందని తెలుస్తుంది. పాన్ ఇండియా సినిమాల్లో చేయాలని అనుకున్నా సరైన ఛాన్స్ రావట్లేదని తెలుస్తుంది. సమంత మళ్లీ ఫోకస్ చేస్తే తెలుగులో కచ్చితంగా మంచి అవకాశాలు వచ్చే ఛాన్స్ ఉంటుంది. ఐతే అమ్మడు మాత్రం బాలీవుడ్ మీదే ఎక్కువ దృష్టి పెట్టింది. సిటాడెల్ తర్వాత మళ్లీ ఆ మేకర్స్ తోనే మరో వెబ్ సీరీస్, సినిమా ఓకే చేసిన సమంత త్వరలోనే ఆ ప్రాజెక్ట్ అనౌన్స్ మెంట్ తో సర్ ప్రైజ్ చేస్తుందని తెలుస్తుంది. సమంత తిరిగి తెలుగులో వరుస సినిమాలు చేయాలని అనుకుంటున్నా ఆమెకు నచ్చిన కథలు రావట్లేదని టాక్.

## ఊర్వశి సొంత డబ్బా దేనికోసం?



కొందరికి సొంత డబ్బా (స్వయం మర్దనం) కొట్టుకోనిదే నిదురే పట్టదు. ఫలానా హిట్టులో నేను భాగం అని చెప్పుకోవడానికి కూడా సొంత డబ్బా అవసరమా? కానీ ఇక్కడ వ్యవహారం చూస్తుంటే, అవును.. నేను కూడా ఈ బ్లాక్ బస్టర్‌లో ఉన్నాను అని గుర్తు చేసేందుకు ఊర్వశి రౌతేలా ఎలా తాపత్రాయపడుతోందో చూశారా? అన్న చందంగా మాట్లాడింది. అంతేకాదు.. అసందర్భంగా సైఫ్ ఖాన్ పై కత్తి దాడి గురించి ఏఎన్.ఐ ప్రతినిధి ప్రశ్నిస్తుంటే, ఊర్వశి దాని గురించి సమాధానం క్లుప్తంగా ఒక లైన్‌తోనే దాటవేసి.. డాకు మహారాజ్ హిట్టయిందని చెబుతూ.. తనకు మమ్మీ డాడీ ఇచ్చిన ఖరీదైన కానుకలను మీడియా ప్రతినిధికి చూపిస్తోంది. నిజానికి ఇది అసందర్భ ప్రవర్తనలా అనిపిస్తుంది. అసలు సైఫ్‌పై దాడి ప్రశ్నకు సరైన సమాధానం ఇవ్వకుండానే తన సక్సెస్ గురించి గొప్పలు పోతూ.. తనకు మమ్మీ డాడీ గిఫ్టులిచ్చారని, అది కూడా డాకు మహారాజ్ సక్సెస్ ఇచ్చిన మజా అంటూ ఊర్వశి పేర్కొంది. ఈ వ్యవహారమంతా వీక్షిస్తున్న ఆడియెన్ మాత్రం ఊర్వశికి నిజంగానే మతిపోయిందా? రాక రాక చాలా కాలానికి సక్సెస్ రావడంతో ఇలా దీనిని ప్రచారం కోసం ఉపయోగిం చుకోవాలని తాపత్రాయపడుతోందా? అంటూ సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతికి విడుదలైన నందమూరి బాలకృష్ణ డాకు మహారాజ్ తెలుగు రాష్ట్రాల్లో మంచి వసూళ్లు సాధిస్తోంది. ఇందులో బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా ప్రత్యేక గీతం దబిడి దిబిడి మాస్ కి మంచి ఊపు తెచ్చింది. ఊర్వశి గతంలో మెగాస్టార్ చిరంజీవి వాల్తేరు వీరయ్యలోను ప్రత్యేక గీతంలో నర్తించిన సంగతి తెలిసిందే.


సిగ్గుపడుతున్నాను: అయితే సైఫ్ అలీఖాన్ పై దాడి గురించి రిపోర్టర్ ప్రశ్నించగా, సైఫ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ఊర్వశి.. తనకు అందిన డైమండ్ రింగ్ బహుమతిని, ఖరీదైన వాచ్‌ని చూపిస్తూ మీడియా ఇంటర్వ్యూలో బోల్డ్ గా మాట్లాడింది. అయితే దీనిపై నెటిజనుల నుంచి చాలా విమర్శలు వెల్లువెత్తాయి. దీనికి ఊర్వశి మరో పోస్ట్ లో స్పందిస్తూ.. అలా జరిగినందుకు సిగ్గుపడుతున్నానని, తన తప్పిదాన్ని క్షమించాలని సైఫ్ ని కోరింది. ఈ ఇంటర్వ్యూ సమయానికి సైఫ్ పరిస్థితిలో సీరియస్ పరిణామం గురించి తనకు తెలియదని, తాను డాకు మహారాజ్ సక్సెస్ ప్రచారంలో ఉన్నానని తెలిపింది.

## పావలా శ్యామలకు ఆర్థిక సాయం చేసిన పూరి జగన్నాథ్ కొడుకు

రంగస్థల నటిగా ఎంట్రీ ఇచ్చి హాస్యనటి, సహాయనటిగా ఎన్నో తెలుగు చిత్రాల్లో నటించి గుర్తింపు తెచ్చుకుంది సీనియర్ నటి పావలా శ్యామల అయితే శ్యామల ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం అస్సలు బాగోలేదు. అనారోగ్య పరిస్థితులతో సినీ ఇండస్ట్రీకి దూరమైన ఆమె కష్టంగా జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తనకు సాయం చేయండి అంటూ తెలుగు సినీ ప్రముఖులను ఆమె వేడుకుంది.అయ్యా.. 50 ఏండ్లుగా కష్టపడి నటిగా బతికాను. ఈ మూడు ఏండ్ల నుంచి నా పరిస్థితి ఎలా అయ్యిందో అందరికీ తెలుసు. ఈ విషయం చాలా ఇంటర్వ్యూలలో కూడా చెప్పాను. కానీ ఎవరు స్పందించలేదు. ఎలాగో ఇంతవరకు వచ్చాను. ఇప్పుడు కొన ఊపిరితో ఉన్నాను. చిరంజీవితో ప్రభాస్‌తో.. మహేశ్ బాబు, ఎన్టీఆర్ ఇలా పెద్ద పెద్ద హీరోల అందరితో చేసి.. ఆఖరికి ఆత్మహత్య చేసుకునే స్థితిలో ఉన్నాను. ట్రీట్మెంట్ చేయించుకోలేక అవస్థగా ఉన్నాను. నన్ను ఇలానే వదిలేసి ఆత్మహత్య చేసుకునేలాగా చేస్తారా.. దయచేసి తనకు సాయం చేయండంటూ శ్యామల తన ఆవేదన వ్యక్తం చేసింది. అయితే శ్యామల పరిస్థితి తెలుసుకున్న పూరి జగన్నాథ్ కొడుకు ఆకాశ్ జగన్నాథ్‌ఆమెని అర్థిక సాయాన్ని అందించాడు. ప్రస్తుతం శ్యామల ఉంటున్న ఉషా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీకి వెళ్లిన ఆకాశ్ శ్యామలను కలిసి ఆమె బాగోగులు తెలుసుకున్నాడు. అనంతరం లక్ష రూపాయలు చేతికి అందించి.. ఏ కష్టం వచ్చిన తాను ఉన్నానంటూ భరోసాను అందించాడు ఆకాశ్. కాగా ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది.

కుటుంబ వివాదాల నేపథ్యంలో నటుడు మంచు మనోజ్‌నేడు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ని కలిసిన విషయం తెలిసిందే. జల్‌పల్లిలోని తన నివాసాన్ని కొందరు ఆక్రమించుకున్నారని.. తన ఆస్తుల్లో ఉంటున్న వారిని ఖాళీ చేయించాలని కోరుతూ.. కొన్ని రోజుల క్రితం మోహన్ బాబు జిల్లా మేజిస్ట్రేట్‌ని ఆశ్రయించారు. అయితే మోహన్ బాబు ఫిర్యాదు మేరకు జల్‌పల్లిలో నివాసం ఉంటున్న మనోజ్‌కు కలెక్టర్ నోటీసులు పంపించారు.

## మాకు ఆస్తి గొడవలు లేవు: మంచు మనోజ్



దీంతో ఈ ఫిర్యాదుకు సంబంధించి కలెక్టర్ ముందు విచారణకు నేడు హాజరు అయ్యాడు మనోజ్. అయితే విచారణ అనంతరం మనోజ్ మీడియాతో మాట్లాడుతూ.. మాకు ఆస్తి గొడవలు లేవని తెలిపాడు. నేను కుర్చోని మాట్లాడుదాం అని చాలా రోజుల నుంచి అడుగుతున్నాను. కానీ ఎవరు స్పందించట్లేదు. ఎవరికి భయపడి నేను పారిపోవట్లేదు. మీరు ఎక్కడికి పిలిచిన వస్తాను. ఇది ఆస్తి కోసం కాదు. మా విద్యాసంస్థల విద్యార్థులకు అన్యాయం జరుగుతుంది. వారికోసం మాట్లాడుతున్నాను. ఈ పోరాటం నా స్టూడెంట్స్ కోసం.. నా బంధువుల కోసం.. నా ప్రజల కోసం అని తెలిపారు.

నూతన, నటీ, నటులు కావలెను
కోకిల క్రియేషన్స్ బ్యానర్లో నిర్మించబోయే చలనచిత్రంలో
నటించుటకు హిరో, హిరోయిన్ పాత్రలకు నూతన నటీనటులు కావలెను.
Kokila Craetions
కోకిల క్రియేషన్స్ లో,
ఫోక్ సాంగ్స్, షార్ట్ ఫిలిమ్స్
వెబ్ సిరీస్‌లో,
MOVIE
నటించుట కొరకు నూతన నటీనటులు కావలెను.
ఆసక్తి కలవారు ఈ క్రింది నంబరు మరియు మెయిల్ ఐడి కి మీ యొక్క వివరాలు
ఫోటోలు పంపించగలరు. వాట్సప్ నంబరు : 9246919390
మెయిల్ ఐడి : rk.neega@gmail.com

## బీసీసీఐ ఆంక్షలతో ఆటగాళ్ల విముఖత..!



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత క్రికెట్ నియంత్రణ మండలి శనివారం చాంపియన్స్ ట్రోఫీ కి, ఇంగ్లాండ్ తో జరిగే వన్డే సిరీస్‌కు భారత జట్టును ప్రకటించింది. కెప్టెన్ రోహిత్ శర్మ , చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ విలేకరుల సమావేశంలో జట్టును ప్రకటించారు. అంతకు ముందు రోహిత్, అగార్కర్ మధ్య సుదీర్ఘ చర్చలు జరిగాయి. దాంతో మీడియా సమావేశం ఆలస్యమైంది. విదేశీ పర్యటన సమయంలో ఆటగాళ్లతో ఫ్యామిలీ గడిపే సమయాన్ని బోర్డు పరిమితం చేసిన క్రమంలో దానిపై అగార్కర్‌తో రోహిత్ మాట్లాడడం కనిపించింది. రోహిత్ వ్యాఖ్యలు వీడియోలో సైతం రికార్డయ్యాయి. కార్యదర్శితో మాట్లాడాల్సి ఉంటుందని.. ఫ్యామిలీ పాలసీపై చర్చించాల్సి ఉంటుందని అగార్కర్‌తో రోహిత్ చెప్పడం వినిపించింది. ఆ తర్వాత అగార్కర్ విలేకరుల సమావేశాన్ని మొదలుపెట్టు చాంపియన్స్ ట్రోఫీ, ఇంగ్లాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌కు జట్టును ప్రకటించారు.

## సిరాజ్, శాంసన్ ఔట్.. వైస్ కెప్టెన్‌గా గిల్.. చాంపియన్స్ ట్రోఫీకి భారత జట్టు



**ముంబై-నవభూమి:** ఫిబ్రవరిలో జరిగే చాంపియన్స్ ట్రోఫీతో పాటు త్వరలో ఇంగ్లండ్‌తో జరగనున్న మూడు వన్డేలకు భారత జట్టును )ప్రకటించారు. కెప్టెన్ రోహిత్ శర్మ, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ .. ఇవాళ మీడియాతో మాట్లాడారు. వన్డేలకు శుభమన్ గిల్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. 15 మంది బృందంలో మహమ్మద్ సిరాజ్, సంజూ శాంసన్‌లకు చోటు దక్కలేదు. రోహిత్ శర్మ, గిల్, జైస్వాల్, కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, రిషబ్ పంత్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, షమీ, హర్షదీప్ సింగ్ బృందంలో ఉన్నారు.అయితే ఇంగ్లండ్‌తో జరిగే వన్డేలకు బుమ్రా ఆడడంలేదు. ఫిబ్రవరిలో అతని ఫిట్‌నెస్‌ను అంచనా వేయనున్నారు. ఒకవేళ బుమ్రా ఫిట్ అయితే ఆ టోర్నీలో అతను ఆడుతాడు. ఇంగ్లండ్‌తో జరిగే వన్డే సిరీస్ కోసం బుమ్రా స్థానంలో హర్షిత్ రాణాకు చోటు కల్పించారు.కరుణ్ నాయర్‌కు పిలుపు రాలేదు. ఇటీవల ముగిసిన విజయ్ హజారే ట్రోఫీలో అతను 7 ఇన్నింగ్స్‌లో 752 రన్స్ చేశాడు. వన్డే టోర్నీలకు అతన్ని ఎంపిక చేస్తారన్న ఊహాగానాలు వినిపించాయి. కానీ సెలెక్టర్లు పెద్దగా ఇంట్రెస్ట్ పెట్టలేదు. బ్యాటర్లు అందరూ 40 యావరేజ్‌తో ఉన్నారని, అందుకే నాయర్‌ను ఎంపిక చేయడం కష్టమైందని చీఫ్ సెలెక్టర్ అగార్కర్ తెలిపాడు.

## ఆస్ట్రేలియన్ ఓపెన్ డబుల్స్‌లో శ్రీరాం బాలాజీ జోడి ఓటమి



**మెల్‌బోర్న్-నవభూమి:** ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల డబుల్స్‌లో ఎన్ శ్రీరాం బాలాజీ, మిగుల్ ఏంజెల్ రియాస్ వరేలా జోడి.. రెండో రౌండ్‌లో ఓడిపోయింది. భారత ఆటగాడు బాలాజీ, మెక్సికో ప్లేయర్ వరేలా.. ఇద్దరూ గట్టి పోటీ ఇచ్చినా.. 6–7 (7), 6–4, 3–6 స్కోరుతో పోర్చుగీస్ జోడి నునో బోర్జెస్, ఫ్రాన్సిస్కో కాబ్రల్ చేతిలో పరాజయం చవిచూశారు. సుమారు రెండు గంటల 9 నిమిషాల పాటు మ్యాచ్ రసవత్తరంగా సాగింది. తొలి సెట్ 56 నిమిషాల పాటు హోరాహోరీగా సాగింది. ట్రైబేకర్‌లో బోర్జెస్, కాబ్రల్ జోడి వత్తిడిలో పైచేయి సాదించింది. ఆ తర్వాత రెండో సెట్‌లో ఇండో–మెక్సిన్ జోడి తీవ్రంగా పోరాడింది. చాలా ఈజీగా ఆ సెట్‌ను సొంతం చేసుకున్నది. కీలకమైె మూడవ సెట్‌లో బోర్జెస్– కాబ్రల్ జోడి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**